www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 203 | ఆదివారం | 19 జులై, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169



## ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

- జోర్డాన్‌లో సైనికుల మృతికి స్పందన
- రివల్యూషనరీ గార్డ్ స్థావరాలే లక్ష్యం
- హార్మూజ్ జలసంధి పరిసరాల్లో సైనిక, మౌలిక సదుపాయాలపై వరుస వైమానిక దాడులు
- మరచిపోలేని గుణపాఠం చెబుతాం అంటూ ఇరాన్ హెచ్చరిక

2



## రష్యాపై డ్రోన్ల వర్షం

2

- మాస్కో సమీపంలో గోదాములు, చమురు డిపో లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు
- తొమ్మిది మంది మృతి.. 80 మందికి పైగా గాయాలు




## ఆహార కల్తీపై ఉక్కుపాదం

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల స్వచ్ఛతపైనా ప్రత్యేక నిఘా
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం.. టోల్‌ఫ్రీ నంబర్, విజిల్‌బ్లోయర్ వ్యవస్థ ఏర్పాటు
- ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

2

# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

## అందెశ్రీతో పాటు గద్దర్‌ను కేసీఆర్ అవమానించారు

- వేల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లతో కులుకుతున్న నేతలు నేనున్నంత వరకు బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల
- నిరుద్యోగులను మోసం చేసిన ఘనత ఆ పార్టీకే దక్కుతుంది
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** దొరల గడీల ముందు ఎప్పుడూ మోకరిల్లని ధైర్యవంతుడు, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తన పాటల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన ప్రజాకవి అందెశ్రీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ప్రముఖ కవి, గేయరచయిత అందెశ్రీ తనకు ఆత్మబంధువులాంటి వారని, తెలంగాణ ఉద్యమానికి ఆయన పాటలు ప్రాణం పోశాయని అన్నారు. అందెశ్రీ జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతివనం'కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీతో పాటు ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా తీవ్రంగా అవమానించిందని ఆరోపించారు. గద్దర్‌ను ప్రగతి భవన్ గేటు వద్ద మండుటెండలో నిలబెట్టిన ఘటనను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. అందెశ్రీ, గద్దర్‌లాంటి ప్రజాకవులను అవమానించినప్పుడే ఆ పాలకులను సాగనంపాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానించారు.

### తెలంగాణ ఉద్యమానికి ఆయన పాటలే స్ఫూర్తి

తెలంగాణ ఉద్యమంలో లక్షలాది మందికి అందెశ్రీ పాటలు స్ఫూర్తినిచ్చాయని సీఎం తెలిపారు. తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన వ్యక్తి అందెశ్రీ అని పేర్కొన్నారు. దొరల గడప తొక్కని వ్యక్తిగా ఆయన నిలిచారని, సమాజానికి మార్గదర్శకత్వం చేసే శక్తి ఆయన రచనల్లో ఉందన్నారు. ఒకప్పుడు నిషేధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక పరిణామమని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారని సీఎం ఆరోపించారు. గ్రూప్ పరీక్షల పేరుతో నోటిఫికేషన్లు ఇచ్చి ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడి యువత భవిష్యత్తుతో ఆటలాడారని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వకుండా తరువాయి 2లో..





- ఉత్తమ నటిగా యామీ గౌతమ్.. నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్
- 'కల్కి 2898 ఏడీ'కి ప్రజాదరణ చిత్రం అవార్డు
- 'అమరన్' దర్శకుడికి ఉత్తమ దర్శకుడి పురస్కారం
- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించిన కేంద్రం

# ఉత్తమ చిత్రం ఆర్టికల్ 370

**న్యూఢిల్లీ:** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. 2024 సంవత్సరానికి సంబంధించిన ఈ అవార్డుల్లో రాజకీయ నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370' అత్యున్నత గౌరవమైన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డును కైవసం చేసుకుంది. అదే చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఉత్తమ నటుడి అవార్డును మలయాళ సినీ దిగ్గజం మమ్ముట్టి (భ్రమయుగం), బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ (చందూ ఛాంపియన్) సంయుక్తంగా దక్కించుకున్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్–370 రద్దు నేపథ్యంలో తెరకెక్కిన 'ఆర్టికల్ 370' చిత్రానికి ఆదిత్య సుహాస్ జంభాలే దర్శకత్వం వహించారు. జమ్మూకశ్మీర్‌ను భారత సమాఖ్యలో పూర్తిస్థాయిలో విలీనం చేసే ప్రక్రియ, ఉగ్రవాదం, అవినీతి, సంఘర్షణల ఆర్థిక వ్యవస్థపై పోరాటాన్ని ఈ చిత్రం ప్రభావవంతంగా ఆవిష్కరించిందని జాతీయ జ్యూరీ అభిప్రాయపడింది. ఇంటెలిజెన్స్ అధికారిణి పాత్రలో యామీ గౌతమ్ ప్రదర్శించిన నటన అత్యంత సహజంగా, హృదయాలను తరువాయి 2లో..



## అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

- స్కైరూట్ ఏరోస్పేస్ విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది ప్రయోగం పూర్తి

6

కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళ

# లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ?
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి.. తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్ కీ దుకాణ్ కాదు.. ధోకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు

**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తెలంగాణ యువతకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు, ప్రైవేటు ఉద్యోగాల్లో 75 శాతం స్థానిక రిజర్వేషన్లు వంటి హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సదస్సు'లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో ఉద్యోగ పర్వం కాకుండా 'ఉన్మాద పర్వం' నడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులను ఉరికించి కొడుతున్నారని, వారిపై ప్రభుత్వం దౌర్జన్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ ఘటనలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై నిర్బంధాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని తరువాయి 2లో..





# తెలంగాణలో వచ్చేది బీజేపీయే

- నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవు
- అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం
- ఎంపీ డా.లక్ష్మణ్
- బండి సంజయ్, ఈటలతో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ భేటీ
- ఇద్దరు నేతల మధ్య సయోధ్యకు యత్నం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో భారతీయ జనతా పార్టీ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, పార్టీని అధికారంలోకి తీసుకురావడమే అందరి లక్ష్యమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య విభేదాలపై వస్తున్న ప్రచారానికి ఆయన తెరదించారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో కీలక నేతల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ శనివారం బండి సంజయ్, ఈటల రాజేందర్‌తో సమావేశమయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, నాయకుల మధ్య సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని పార్టీ అంతర్గతంగా పరిష్కరించుకోవాలని అభయ్ పాటిల్ ఇద్దరు నేతలకు సూచించినట్లు సమాచారం. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది.

### ప్రజల్లో కాంగ్రెస్‌పై అసంతృప్తి

సమావేశం అనంతరం బండి సంజయ్, ఈటల రాజేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన ఎంపీ లక్ష్మణ్, తెలంగాణలో రాజకీయ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, బీఆర్ఎస్‌పై కూడా విశ్వాసం తగ్గిపోయిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతోందని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీజేపీ అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను గణనీయంగా పెంచుకుంటుందని లక్ష్మణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలు జరిగే అవకాశాలపై కూడా ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయానికి సిద్ధంగా ఉందన్నారు.

### విభేదాలకు చెక్

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, అందుకోసం నాయకుల మధ్య ఉన్న చిన్నచిన్న భేదాభిప్రాయాలను తొలగించి అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి పార్టీ అధిష్ఠానం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలోనే బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య సమన్వయం పెంపొందించే ప్రయత్నంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని లక్ష్మణ్ విమర్శించారు.

# ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులు

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై జరిగిన డ్రోన్, క్షిపణి దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరో సైనికుడు అదృశ్యమయ్యాడు. నలుగురు సైనికులు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు ప్రతీకారంగా అమెరికా శనివారం ఇరాన్‌పై మరో విడత వైమానిక దాడులు ప్రారంభించింది. అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్‌కు చెందిన కీలక సైనిక స్థావరాలు, భూగర్భ ఆయుధ నిల్వ కేంద్రాలు, నిఘా వ్యవస్థలు, సముద్ర రక్షణ సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించారు. హార్మూజ్ జలసంధిలో చమురు ట్యాంకర్ల రాకపోకలకు అంతరాయం కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ ఆపరేషన్ ఉద్దేశమని అమెరికా తెలిపింది.

### విద్యుత్, నీటి ప్రాజెక్టులకు నష్టం

దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లో విద్యుత్ కేంద్రాలు, సముద్ర జలాలను మంచినీటిగా మార్చే డీశాలినేషన్ ప్లాంట్లపై కూడా అమెరికా దాడులు జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. బొంజీ డీశాలినేషన్ ప్లాంట్ పూర్తిగా ధ్వంసం కావడంతో దాదాపు 10వేల మందికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న ఖేష్మ్ ద్వీపంలోని మరో ప్లాంట్‌కు కూడా నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఇరాన్‌లోని ప్రధాన ఓడరేవు బందర్ అబ్బాస్‌కు వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న రెండు సొరంగాలు, ఒక వంతెన దాడుల్లో ధ్వంసమయ్యాయి. శనివారం మరో మూడు వంతెనలు కూడా దెబ్బతిన్నట్లు ఇరాన్ అధికార వార్తా సంస్థ వెల్లడించింది. గత మూడు వారాలుగా కొనసాగుతున్న అమెరికా దాడుల్లో కనీసం 50 మంది మృతిచెందగా, 500 మందికి పైగా గాయపడినట్లు ఇరాన్ తెలిపింది.

### ఒప్పందం అమలు నిలిపివేసిన ఇరాన్

అమెరికా దాడులు కొనసాగితే మరచిపోలేని గుణపాఠం చెబుతామని ఇరాన్ సుప్రీం నాయకత్వం హెచ్చరించింది. అమెరికాతో నెల రోజుల క్రితం కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని ఇకపై అమలు చేయబోమని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ ప్రకటించారు. ఒప్పంద నిబంధనలను అమెరికానే ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. యుద్ధ ప్రభావం గల్ఫ్ ప్రాంత దేశాలపై కూడా కనిపిస్తోంది. కువైట్‌లో చమురు కేంద్రం, డీశాలినేషన్ ప్లాంట్‌పై జరిగిన దాడులతో అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఇరాక్‌లో దాడి డ్రోన్లను భద్రతా బలగాలు కూల్చివేయగా, జోర్డాన్ గగనతలంలో క్షిపణులను అడ్డుకున్నాయి. బహ్రెయిన్, సౌదీ అరేబియాల్లో పలుమార్లు ఎయిర్ రైడ్ సైరన్లు మోగడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు.

మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా ప్రపంచవ్యాప్తంగా ట్రావెల్ అలర్ట్ జారీ చేసింది. ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హార్మూజ్ జలసంధి చుట్టూ యుద్ధ వాతావరణం నెలకొనడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# రష్యాపై డ్రోన్ల వర్షం



**మాస్కో:** రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఐదో సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దాడులు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఉక్రెయిన్ శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు నిర్వహించిన భారీ డ్రోన్ దాడుల్లో రష్యాలోని గోదాములు, చమురు నిల్వ కేంద్రాలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలు లక్ష్యంగా మారాయి. ఈ దాడుల్లో తొమ్మిది మంది మృతిచెందగా, 80 మందికిపైగా గాయపడినట్లు రష్యా అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ డ్రోన్లు రష్యా ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ సంస్థ వైల్డ్‌బెరీస్‌కు చెందిన రెండు భారీ గోదాములపై దాడి చేశాయి. ఒకటి టాంబోవ్ ప్రాంతంలోని కొటోవ్స్క్‌లో, మరొకటి మాస్కోకు తూర్పున ఉన్న ఎలెక్ట్రోస్టాల్‌లో ఉంది. ఈ రెండు గోదాముల్లో భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. కొటోవ్స్క్‌లో జరిగిన దాడిలో రాత్రి విధుల్లో ఉన్న ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది గాయపడ్డారు. ఎలెక్ట్రోస్టాల్‌లోని గోదాములో మంటలు భారీగా వ్యాపించాయని అధికారులు తెలిపారు. మాస్కో సమీపంలోని నోగిన్స్క్ నగరంలోని చమురు నిల్వ కేంద్రంపై కూడా డ్రోన్ దాడి జరిగింది. దీంతో అక్కడ భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమీపంలోని ప్రసూతి ఆస్పత్రి, నివాస భవనాలను అధికారులు ఖాళీ చేయించారు. డ్రోన్ శకలాలు సమీపంలోని ఓ కిండర్ గార్టెన్‌పై పడటంతో అక్కడ కూడా మంటలు చెలరేగినా, వెంటనే అదుపులోకి తీసుకొచ్చారు.

### 80 మందికిపైగా గాయాలు

మాస్కో ప్రాంతంలో మొత్తం 61మంది గాయపడినట్లు గవర్నర్ ఆంద్రే వొరోబ్యోవ్ తెలిపారు. వీరిలో 40మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. బెల్గొరోడ్ ప్రాంతంలో జరిగిన మరో డ్రోన్ దాడిలో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. రష్యా డ్రోన్ తయారీ, నావిగేషన్ పరికరాలకు అవసరమైన కీలక విడిభాగాల సరఫరా కేంద్రాలనే లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. టాంబోవ్, మాస్కో ప్రాంతాల్లోని లాజిస్టిక్స్ కేంద్రాలతో పాటు ఒక చమురు నిల్వ కేంద్రాన్ని కూడా ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. అలాగే అజోవ్, నల్ల సముద్ర ప్రాంతాల్లో రష్యా వినియోగిస్తున్న రెండు ట్యాంకర్లు, రెండు తేలియాడే క్రేన్లు, ఒక టగ్‌బోట్‌పై కూడా దాడులు చేసినట్లు ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది.

### 379 డ్రోన్లను కూల్చివేశాం: రష్యా

రాత్రి నుంచి జరిగిన దాడుల్లో మొత్తం 379 ఉక్రెయిన్ డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ డ్రోన్లు 19 రష్యా ప్రాంతాలతో పాటు క్రిమియా, అజోవ్ సముద్రం, నల్ల సముద్రం మీదుగా వచ్చినట్లు తెలిపింది. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ ఇరు దేశాలు ఒకదానిపై మరొకటి కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు ముమ్మరం చేయడంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి.




# ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు

- అవసరమైన సరఫరా కొనసాగించాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని విస్తరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 'పవర్ అంబులెన్స్' సేవలను మరింత బలోపేతం చేసి, విద్యుత్ అంతరాయాలను వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా సౌర విద్యుత్ సదుపాయం కల్పించాలని, ఐటీ కారిడార్‌లో అవసరమైన ప్రాంతాల్లో జీఐఎస్ (గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గియర్) సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఇంధన భద్రతకు ప్రాధాన్యం

భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాక్‌లను కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌లో నిర్ణీత గడువులోనే బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, కోయగూడెం–3, సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి దక్కేలా కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తూ వ్యవసాయం, పరిశ్రమలు, గృహాలు, వాణిజ్య రంగాలకు విశ్వసనీయమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి స్పష్టం చేశారు.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆహార, ఔషధాల కల్తీని పూర్తిగా అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురానుంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేలా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఆహార, ఔషధాల కల్తీ నియంత్రణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, ఇతర ఆహార పదార్థాలను ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేలా చేయడానికి విచ్చలవిడిగా రసాయనాలు వినియోగించడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు వస్తువులు విక్రయిస్తున్నప్పటికీ, అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అనే విషయాన్ని నిర్ధారించే పటిష్టమైన వ్యవస్థ ప్రస్తుతం లేదని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

### ప్రపంచ స్థాయి చట్టాలపై అధ్యయనం

ఆహార, ఔషధ కల్తీ నియంత్రణలో సమర్థవంతంగా పనిచేస్తున్న దేశాల చట్టాలు, అమలు విధానాలను అధ్యయనం చేసి, వాటిలోని ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేసేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. అనంతరం సమగ్ర బిల్లును రూపొందించి శాసనసభలో విస్తృతంగా చర్చించిన తర్వాత ప్రజల అభిప్రాయాలను కూడా స్వీకరించి తుది రూపు ఇవ్వాలని స్పష్టం చేశారు. కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్‌బ్లోయర్ వ్యవస్థను కూడా అమల్లోకి తీసుకురావాలని సూచించారు. ప్రజల సహకారంతో కల్తీ ముఠాలపై మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

### పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్

కల్తీ నిరోధక వ్యవస్థను తొలి దశలో హైదరాబాద్ నగరంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సీఎం సూచించారు. పైలట్ ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే లోటుపాట్లను విశ్లేషించి, అవసరమైన మార్పులు చేసిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం కారణంగా పంటల్లో రసాయన అవశేషాలు పెరిగి, అంతర్జాతీయ ప్రమాణాలు దెబ్బతింటున్నాయని సీఎం పేర్కొన్నారు. దీంతో విదేశీ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాణ్యత నియంత్రణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కల్తీకి పాల్పడే వారిపై ఇకపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో డీజీపీ జితేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరా నగర్ బీజేపీ సీనియర్ నాయకుడు దండుగుల శ్రీనివాస్, ఫిలింనగర్ మాగంటి కాలనీకి సీనియర్ నాయకుడు మేకల గణేశ్ యాదవ్‌ను పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా నియమించింది. ఈ సందర్భంగా నేతలిద్దరికీ స్థానిక నేతలు శుభాకాంక్షలు తెలిపారు.



ఫిలింనగర్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

# నిరుద్యోగులపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు

- కాంగ్రెస్ నాయకుడు కాటూరి రమేశ్

**ప్రజానావ, ఖైరతాబాద్:** నిరుద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ నాయకుడు కాటూరి రమేష్ విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకులు, పరీక్షల వాయిదాలతో యువత తీవ్రంగా నష్టపోయిందని, ఇప్పుడు అదే పార్టీ నిరుద్యోగుల పక్షాన మాట్లాడటం విడ్డూరమన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 80 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసిందని, మరో 30 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను నమ్మవద్దని యువతకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

(మొదటిపేజీ తరువాయి)

తమ కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల కోసం అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, తెలంగాణను శవాల రాష్ట్రంగా మార్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు.

### 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దాదాపు 70వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం తెలిపారు. 16సంవత్సరాల తర్వాత గ్రూప్–1 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. ఉద్యోగ నియామక పత్రాలను అభ్యర్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టేసి, ఫామ్‌హౌస్‌ల రాజకీయాలు మాత్రమే చేసిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఆదరించి సంపన్నులను చేశారని, కానీ ఆ కుటుంబం రాష్ట్రానికి తిరిగి ఏం చేసిందని ప్రశ్నించారు. కేసీఆర్ వెయ్యి ఎకరాల్లో, కేటీఆర్ వంద ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని ఆరోపించారు. నిజాం రాజును మించిన స్థాయిలో వారు ఎలా ధనవంతులయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు ఇప్పటికే తీర్పు చెప్పారని సీఎం అన్నారు. తాను ఉన్నంతకాలం ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రానివ్వబోనని స్పష్టం చేశారు. తెలంగాణ సంపదను మళ్లీ దోచుకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే ప్రజాకవి అందెశ్రీ మరోసారి పాటగా పుట్టి ప్రజలను చైతన్యపరుస్తారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఉత్తమ చిత్రం ఆర్టికల్ 370

(మొదటిపేజీ తరువాయి)

తాకేలా ఉందని జ్యూరీ చైర్మన్, ప్రముఖ మలయాళ దర్శకుడు జయరాజ్ ప్రశంసించారు. సత్యం, న్యాయం కోసం పోరాడే అధికారిణి పాత్రను ఆమె సున్నితత్వం, ధైర్యం, నిబద్ధతతో అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. మలయాళ చిత్రం 'భ్రమయుగం'లో అసాధారణ నటన కనబరిచిన మమ్ముట్టి, భారత తొలి పారాలింపిక్ స్వర్ణ పతక విజేత మురళీకాంత్ పెట్కర్ జీవితకథ ఆధారంగా తెరకెక్కిన 'చందూ ఛాంపియన్' చిత్రంలో విశేష ప్రతిభ కనబరిచిన కార్తీక్ ఆర్యన్ ఉత్తమ నటులుగా ఎంపికయ్యారు.

### ఉత్తమ దర్శకుడిగా పెరియసామి

అశోక్ చక్ర పురస్కార గ్రహీత మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితకథ ఆధారంగా రూపొందిన తమిళ చిత్రం 'అమరన్'కు దర్శకత్వం వహించిన రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడి అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' చిత్రానికి దర్శకత్వం వహించిన రణదీప్ హుడా ఉత్తమ తొలి దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ చిత్రంలో ఆయన సావర్కర్ పాత్రను కూడా పోషించడం విశేషం. తెలుగు దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం విభాగంలో జాతీయ అవార్డును గెలుచుకుంది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె, కమల్ హాసన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం గత ఏడాది దేశవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

### ఇతర ముఖ్య పురస్కారాలు

జాతీయ, సామాజిక, పర్యావరణ విలువలను ప్రోత్సహించిన ఉత్తమ చిత్రంగా ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' ఎంపికైంది. హిందీ చిత్రం 'భక్షక్'లో నటించిన సంజయ్ మిశ్రా ఉత్తమ సహాయ నటుడి అవార్డును అందుకోగా, 'మైదాన్' చిత్రంలోని 'జానే దో' పాటకు మనోజ్ ముంతశిర్ ఉత్తమ గేయ రచయితగా జాతీయ పురస్కారం దక్కింది. 2024 సంవత్సరానికి సంబంధించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు, హిందీ, తమిళ, మలయాళ చిత్రాలు పలు విభాగాల్లో విశిష్ట గుర్తింపు పొందడం భారతీయ సినీ పరిశ్రమ వైవిధ్యాన్ని, సృజనాత్మకతను మరోసారి చాటిచెప్పింది.

### ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు'

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్లు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది.



# లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విడుదల చేసిన యూత్ డిక్లరేషన్‌లోని ఒక్క హామీ కూడా అమలు కాలేదని కేటీఆర్ అన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.10 లక్షల రుణాలు, ప్రైవేటు ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు విశ్వవిద్యాలయాల ఏర్పాటు వంటి హామీలు ఎక్కడ అమలయ్యాయని నిలదీశారు. పదో తరగతి ఉత్తీర్ణులకు రూ.10 వేల ప్రోత్సాహకం, ఇంటర్‌కు రూ.15 వేలు, డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.లక్ష, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారికి రూ.5 లక్షల ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారని విమర్శించారు.

### ధోకా మకాన్‌గా కాంగ్రెస్ పాలన

కాంగ్రెస్ ప్రభుత్వం 'మొహబ్బత్ కీ దుకాణ్' నడపడం లేదని, 'ధోకా మకాన్'గా పాలన సాగుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'కొలువుల కుంభమేళా' అని ప్రచారం చేసి, చివరకు 'కుంభకోణాల కుంభమేళా'గా మార్చేశారని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతుంటే, తెలంగాణలో ప్రజల సంపద దోచుకుంటున్నారని ఆరోపించారు. అశోక్‌నగర్‌లో నిర్వహించిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ మరచిపోయారని, తెలుగు తెలియకపోవడం వల్ల తెలంగాణ యువత బాధ ఆయనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ యువతను కాంగ్రెస్ మరోసారి మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. 38 నెలల క్రితం ఇదే సరూర్‌నగర్ వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకటించి భారీ హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. మాట తప్పి, మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు యువతను నట్టేట ముంచిందని ఆరోపించారు. 1952, 1969 ఉద్యమాల నుంచి తెలంగాణ ఉద్యమం వరకు కాంగ్రెస్ యువతను ఎన్నోసార్లు మోసం చేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. చరిత్రను మరచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్ర, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సూచించారు.



## భద్రతకు 'స్పెషల్ బ్రాంచ్' కవచం

**వనపర్తి ఎస్పీ సునితరెడ్డి**

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** జిల్లా భద్రతా వ్యవస్థలో స్పెషల్ బ్రాంచ్ విభాగం కీలక పాత్ర పోషిస్తోందని, నేర నియంత్రణకు ఈ సమాచారమే బలమైన కవచమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి సమాచార సేకరణతో నేరాలను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతుందన్నారు. పాస్‌పోర్ట్, ఉద్యోగ వెరిఫికేషన్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల జారీలో పారదర్శకతతో వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. సమన్వయం, క్రమశిక్షణతో పనిచేసి పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్సైలు మంజునాథ్ రెడ్డి, నరేష్, పర్వతాలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మర్రిగూడ ఫ్లైఓవర్‌ను వెంటనే ప్రారంభించాలి

**మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అరెస్ట్**

**ప్రజానావ, నల్లగొండ:** నల్లగొండ శివారులోని మర్రిగూడ బైపాస్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్‌ను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు చర్లపల్లి వద్ద నిరసన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కంచర్ల భూపాల్‌రెడ్డి, మర్రిగూడ, పానగల్ బైపాస్‌ల వద్ద ఫ్లైఓవర్లు లేకపోవడంతో గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే ఫ్లైఓవర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలులో

# అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- పెండింగ్ సంక్షేమ నిధుల పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలి
- గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు
- ఐడీఓసీలో జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష



**ప్రజానావ, పెద్దపల్లి :** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు, జె. అరుణ శ్రీ లతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే గురుకులాలు, సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారానికి సంబంధించిన 50 శాతం నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం, గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ నిధులు ఎంత ఉన్నాయో పూర్తి వివరాలను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నందున, పెండింగ్‌లో ఉన్న అన్ని నిధుల విడుదల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, మిగిలిన నిధులన్నింటినీ విడుదల చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేకుండా పూర్తి విద్యార్థి సామర్థ్యంతో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉపాధి కల్పనలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే అన్ని ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్ నిబంధన లను కచ్చితంగా పాటించాలని సూచించారు. రిజర్వేషన్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేసి, అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, నిబంధనల ప్రకారం సత్వర విచారణ నిర్వహించి ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిజమైన బాధితులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంబంధిత అధికారుల కు సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కమిషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి, గురుకుల విద్యాసంస్థల బలోపేతం, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్, ఆర్డీవోలు బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్, ఏసిపి రమేష్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు

- రూ. 2.55 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టిక ఆహారం
- విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- బొంపెల్లి నుండి తెనుగుపల్లి వరకు రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజానావ, పెద్దపల్లి :** మండలంలోని పెద్దకల్వల, నిట్టూరు, తుర్కల మద్దికుంట, బొంపల్లి, రాగినేడు, అప్పన్నపేట గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2.55 కోట్ల డి.ఎం.ఎఫ్.టి నిధులతో స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు చేశారు. తదుపరి పెద్దకాల్వల గ్రామంలో నూతనంగా రూ.5 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు ప్రారంభం, బొంపెల్లి గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి తెనుగుపల్లి వరకు రూ.50 లక్షలతో బి.టి రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యం కావడం జరిగిందని అలాగే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి పెద్దకల్వల గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 19 లక్షలు, నిట్టూరు గ్రామ పాఠశాలకు రూ. 45 లక్షలు, తుర్కల మద్దికుంట గ్రామానికి రూ. 48 లక్షలు, బొంపల్లి గ్రామానికి రూ.25 లక్షలు, రాగినేడు గ్రామానికి రూ. 58 లక్షలు, అప్పన్నపేట గ్రామానికి రూ. 60.50 లక్షల నిధులను వెచ్చించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి మండలం, పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ.5.70 కోట్లను మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని అందులో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో టాప్ లో నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచామని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించడం జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాసంస్థలకు మెరుగైన సదుపాయాలను అందిస్తున్నామని ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుకు కృషి చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- రానున్న ఆరు నెలల్లో పాఠశాలల మౌలిక వసతుల పనులు పూర్తి
- ప్రతి తల్లిదండ్రులు పేరెంట్ - టీచర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలి
- తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



**ప్రజానావ, పెద్దపల్లి :** విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభ కనబరుస్తారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం పెద్దపల్లి మండలంలోని తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పాఠశాలలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల బాధ్యతలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతుల పనులన్నింటినీ రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్యం సాధించడంలో తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్–టీచర్ సమావేశాలకు హాజరై తమ పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏదైనా కారణంతో కొద్ది రోజులు పాఠశాలకు రాలేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని, తద్వారా వారు మిస్సైన పాఠాలను ప్రత్యేకంగా బోధించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కొంత సమయం పిల్లలతో గడపాలని, పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో, హోంవర్క్ ఇచ్చారా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ హోంవర్క్ పూర్తి చేసేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు. తల్లిదండ్రులు ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి తమ పిల్లల విద్యా పురోగతి, ప్రవర్తన గురించి ఉపాధ్యాయులను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం సమష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంపూర్ణ సహకారం లభిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. శారద, జి.సి.డి.ఓ. కవిత, సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజు లత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్



**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లా వ్యాప్తంగా నిర్మాణ పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వేగ వంతంగా పూర్తి చేయడం పై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడం, రెండో దశలో ఇండ్ల మంజూరుపై గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని మండలాలకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, వివిధ దశల్లో ప్రగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఇండ్లు లేని పేదల కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు వేగవంతం చేసేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా నిర్మాణాల్లో జాప్యం జరిగితే వాటి కారణాలు తెలుసుకుని, సమస్యలు పరిష్కరించి, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రగతిలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయాలని ఆదేశించారు. రోజు వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. రెండో దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

**కలెక్టర్ బడుగు చంద్రశేఖర్**

**ప్రజానావ, నల్లగొండ:** ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు స్పందించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వివిధ పరిపాలనా అంశాలపై సమగ్రంగా చర్చించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, వ్యవసాయ అవసరాలు, ఇతర అత్యవసర సేవల నిర్వహణకు సంబంధించి మండల స్థాయి అధికారులు ముందస్తు విపత్తు నిర్వహణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని, స్థానిక ప్రజలు, మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ప్రాంతంలోనైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ఆర్డీవోలు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పూర్తిగా పరిష్కరించాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ), కోర్టులకు సంబంధించిన కేసులను కూడా వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రాష్ట్ర శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్‌పాషా, ఆర్డీవోలు వై. అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ దేవరాజ్‌తో పాటు ఇతర రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో కలపాలని రాత్రి వేళ ధర్నా

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** తమ తల్పునూర్ గ్రామాన్ని వనపర్తి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలో కలపాలంటూ అఖిల పక్ష జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు శనివారం నాటికి 33వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు, నాయకులు చలిని సైతం లెక్కచేయకుండా రాత్రి వేళల్లోనూ రోడ్లపైనే బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్నారు. భౌగోళిక, రవాణా సౌకర్యాల దృష్ట్యా తమను నాగర్‌కర్నూల్‌లోనే ఉంచాలని, డిమాండ్ నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని ఉద్యమకారులు స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ముప్పు, పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలి

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాధార సాగుపై ఆధారపడే రైతులకు నష్టాలు కలగకుండా పంటల మార్పిడిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉన్నందున, వర్షాధార రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు గ్రామాల వారీగా రైతులతో సమావేశాలతో చైతన్యపరచాలని సూచించారు.



## బిజినపల్లిలో 111 బస్తాల నకిలీ డీఏపీ స్వాధీనం

- రంగంలోకి కలెక్టర్, ఎస్పీ సంగ్రామ్ సింగ్
- కర్ణాటక ముఠా పనేనని అనుమానం

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** మండలంలోని మహదేవుని పేట గ్రామంలో భారీగా నిల్వ ఉంచిన 111 బస్తాల నకిలీ డీఏపీ ఎరువులను వ్యవసాయ, పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గురువారం సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. కర్ణాటకకు చెందిన కొందరు వ్యక్తులు మార్కెట్ ధర కంటే తక్కువగా బస్తా రూ.16–1700లకే విక్రయించడంతో స్థానిక ఏడుగురు రైతులు వీటిని కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బస్తాల నుంచి నమూనాలను సేకరించి వెంటనే హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వ్యవహారంపై ఎస్పీ మాట్లాడుతూ.. రైతులను మోసం చేసే నకిలీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే బిల్లులతో ఎరువులు కొనాలని సూచించారు. తనిఖీల్లో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ షంషద్దీన్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా మండేలా, అందెశ్రీ జయంతి

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా 108వ జయంతి, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ 65వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ.. జాతి వివక్షపై పోరాడిన నల్లసూర్యుడు నెల్సన్ మండేలా, తన పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఊపిన లోకకవి అందెశ్రీల జీవితాలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ నేడు రాష్ట్ర అధికారిక గీతంగా నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, డా. నరసింహ శర్మ, గంధం నాగరాజు, దేవన నాయుడు, శ్రీనివాసులు శెట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

**మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశం**



**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, వేగంగా పూర్తి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం వీపన గండ్లలో బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. వలస వెళ్లిన ఓటర్లను ఫోన్లలో సంప్రదించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా విజయవం తంగా పూర్తి చేసిన సిబ్బందిని ప్రోత్సహించేందుకు తొలి బహుమతిగా రూ.10వేలు ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు నగదు పురస్కారాలు అందిస్తామని మంత్రి ప్రకటించారు.



# కాళేశ్వరం.. ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం!

ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలిం పు అసాధ్య మని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగ డంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. మోటార్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. దే విషయాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయన ను బీఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు.

దొంగలుపడ్డ ఆరు నెలలకు.. అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచార ణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. వలం బీఆర్ఎస్సే రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వ రం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగం లోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని వలం రాజకీయంగా ఉపయోగించు కుని బీఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగిం లోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందు నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలిం పు అసాధ్య మని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగ డంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయన ను బీఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమా లు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకా నేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరించాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నా రు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డావ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి డా ఆరోపించింది. రేవంత్ రెడ్డి డా ఇదే ప ÷– రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరుల ను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణల తోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను డా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి సీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు డా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజె క్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌ స్ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపా లని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చొ అన్నదానిపై ఆలోచన చేసి ఉండా ల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారే యడంలో బీఆర్ఎస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో రుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కవూషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవా దాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్ రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపి స్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగే షన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపో వడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్కు ఆక్సిజన్ నింపుతోంది.

అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్ రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపి స్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి.

EDITORIAL



# పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** వనపర్తి జిల్లా ఏదుల మండల కేంద్రంతో పాటు చెన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లల్లో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎండీ. జబ్బార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయా పాఠశాలలను సిపిఎం ప్రతినిధి బృందం సర్వే చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదుల హైస్కూల్‌లో శిథిలావస్థకు చేరిన వంటగదికి మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు నాసిరకం బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతు న్నారని, ప్రచారానికే పరిమితం కాకుండా నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా భోజన మెనూ ఛార్జీలు పెంచాలని, విద్యార్థులకు ఉపాహార పథకా న్ని అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమావేశాల కోసం మీటింగ్ హాల్, లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. చెన్నారం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఫిల్టర్ వాటర్, వాచ్‌మెన్, అటెండర్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడ్డికోపుల మహేష్, కోడిగంటి రాజశేఖర్, శీను, రమేష్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా
# మెట్ట పంటలు సాగు చేయాలి

- మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి
- కూసుమంచి పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.4.61 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సంక్షేమ చెక్కుల పంపిణీ



**ప్రజానావ, కూసుమంచి:** ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు సంప్రదాయ సాగు విధానాలకు మాత్రమే పరిమితం కాకుండా మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన మాట్లా డుతూ అధిక నీటి అవసరం ఉండే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, వాతావరణ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు సూచించే సాగు విధానాలను అనుసరించడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతాంగానికి అండగా నిలుస్తోందని, ఇప్పటికే రైతు భరోసా వంటి పథకాల ద్వారా అన్నదాతలకు సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. మారుతున్న ప్రకృతి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు. పర్యటనలో భాగంగా మంత్రి రూ.4.61 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ.2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కాలువ నుంచి భగవాన్‌తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రహదారికి, రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం కోక్యా తండాలో రూ.1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, అగ్రహారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంత్రి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేయగా, వివిధ అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 111 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.35.16 లక్షల విలువైన ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణకు ఆదేశాలు

- వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- ప్రతి గ్రామం నుంచి ముగ్గురు రైతులకు ఆయిల్‌పామ్ ప్రత్యేక శిక్షణ
- 100 మంది నమోదు అయితే జిల్లాలోనే జర్మన్ భాష శిక్షణ కేంద్రం
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజానావ, సిద్ధిపేట:** వానాకాలం–2026లో ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ, అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సిద్ధిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కంటిం జెన్సీ కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతిని ధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు ఎల్‌నినో ప్రభావమేనని పేర్కొన్న ఆయన, దీని కారణంగా భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను మళ్లించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో మూడు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా నాలుగు నుంచి ఎనిమిది ఎకరాల వరకు కంది, రాగులు, సజ్జలు వంటి పంటలను సాగు చేయవచ్చని మంత్రి తెలిపారు. నీటి లభ్యత తగ్గే పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలే రైతులకు భద్రత కల్పిస్తాయని పేర్కొంటూ జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రైతులను చైతన్యవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న మంత్రి, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, అధిక ఆదాయం, అడవి పందులు, కోతుల బెడద లేకపోవడం, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వంటి ప్రయోజనాలను రైతులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం ముగ్గురు రైతులను ఎంపిక చేసి ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, వారు తమ గ్రామాల్లో ఇతర రైతులకు మార్గదర్శకులుగా నిలిచేలా కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని గృహ అవసరాల్లో నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాదని, సమర్థవంతమైన ప్రణాళికతో దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్న మంత్రి, అవసరమైతే అదనపు సమయం కేటాయించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలో వరి సాగు ఆశాజనకంగా సాగిందని, రాబోయే రెండేళ్ల అవసరాలకు సరిపడా ధాన్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఇదే సందర్భంగా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా విదేశీ ఉపాధి అవకాశాలపై మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించిందని, టామ్‌కామ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. కృత్రిమ మేధస్సు ప్రభావంతో ఐటీ రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో విదేశీ ఉపాధి అవకాశాలను యువత వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు టామ్‌కామ్ ద్వారా సుమారు ఐదు వేల మందికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని, ప్రస్తుతం అక్కడ ఐదు లక్షల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలో ఆసక్తిగల 100 మంది నిరుద్యోగ యువత నమోదు చేసుకుంటే సిద్ధిపేటలోనే జర్మన్ భాష శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ అనంతరం జర్మనీలో ఉద్యోగాలు కల్పించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గిందని తెలిపారు. జూన్ నెలలో నమోదుకావాల్సిన వర్షపాతంలో కేవలం 42 శాతం మాత్రమే నమోదు కాగా, జూలైలో ఇప్పటివరకు 32 శాతం మాత్రమే వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలోని 26 మండలాల్లో నాలుగు మండలాల్లో అత్యల్ప, 17 మండలాల్లో తక్కువ, ఐదు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని వివరించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే మూడు రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రస్తుతం జిల్లాలో తాగునీటి సమస్య లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీవోలు, ఏఎంసీ చైర్మన్లు వంటేరు నరేందర్ రెడ్డి, చెరుకు అమర్, విరుపాక శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్లు గాంధారి నరేందర్ రెడ్డి, పూజల హరికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# ఖమ్మం రైతులకు శాశ్వత భరోసా

- ప్రారంభానికి సిద్ధమైన గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ
- అంజనాపురంలో అత్యాధునిక పరిశ్రమను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రవాణా భారం తగ్గి రైతులకు ఊరట ఉపాధి అవకాశాలకు కొత్త దారులు
- ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చే అత్యాధునిక గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన ఈ భారీ పరిశ్రమను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో వేలాది ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. అయితే పండించిన గెలలను స్థానికంగా ప్రాసెసింగ్ చేసే సౌకర్యం లేక రైతులు సుదూర ప్రాంతాలకు తరలించాల్సి రావడంతో అధిక రవాణా వ్యయం, సమయ నష్టం ఎదుర్కొంటున్నారు. గెలలను కోసిన 24 గంటల్లోపు క్రషింగ్ చేయాల్సిన అవసరం ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అంజనాపురంలో గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ నిర్మించిన అత్యాధునిక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి రానుండటం రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఇప్పటికే యంత్రాల ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తి కాగా, విద్యుద్దీకరణ, అంతర్గత రహదారులు, అత్యాధునిక క్రషింగ్ యంత్రాల ఏర్పాటు సహా అన్ని నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఫ్యాక్టరీ ప్రారంభం అనంతరం ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు తమ పంటను నేరుగా ఇక్కడికే తరలించే అవకాశం లభించనుంది. దీంతో రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు సకాలంలో పంటను విక్రయించి చెల్లింపులు వేగంగా పొందే అవకాశం కలుగనుంది. రైతులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు వారి ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ రంగానికే కాకుండా ఈ పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా వందలాది ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేస్తోంది. ఫ్యాక్టరీ ప్రాంగణంలో సభా వేదిక, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తదితర ఉన్నతాధికారులు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సభకు హాజరయ్యే రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీలు, సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదికను వంద మంది ప్రముఖులు ఒకేసారి ఉండేలా పటిష్టంగా నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా బహుస్థాయి భద్రతా ఏర్పాట్లు చేపట్టి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రణాళికను అమలు చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా స్టాండ్‌బై జనరేటర్లు సిద్ధం చేయడంతో పాటు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యతను కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, ఉద్యానవన, పరిశ్రమల శాఖల అధికారులు గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో కలిసి సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. సభకు హాజరయ్యే వారందరికీ కార్యక్రమం స్పష్టంగా కనిపించేలా భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు, మార్కెటింగ్ సౌకర్యాల బలోపేతానికి ఈ ఫ్యాక్టరీ కీలక మైలురాయిగా నిలవడంతో పాటు ఖమ్మం జిల్లా, పరిసర ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతు న్నారు. అత్యాధునిక ప్రాసెసింగ్ కేంద్రం అందుబాటులోకి రానుండటంతో జిల్లాలోని ఆయిల్‌పామ్ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# రైస్‌మిల్లు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి
- రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** రైస్‌మిల్లు డ్రైవర్లు, హమాలీలకు ఉపాధి భద్రత కల్పిస్తూ సమగ్ర చట్టం చేయాలని, వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల రైస్ మిల్ డ్రైవర్స్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పెబ్బేరులోని పలు రైస్‌మిల్లుల్లో యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు శ్రమిస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. మిల్లుల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, బోనస్ వంటి చట్టాలు అమలు కాకపోవడం విచారకరమన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, నెలకు రూ.9వేల కనీస పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న వనపర్తి జిల్లా కేంద్రంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు నంబి శ్రీను, పెబ్బేరు అధ్యక్షుడు వడ్ల శ్రీను, అఫ్సర్, శేఖర్ రెడ్డి, దేవన్న తదితరులు పాల్గొన్నారు.





# మధ్యాహ్న భోజనంపై తల్లిదండ్రుల ఆందోళన

- అన్నంలో పురుగులు, ఇసుక వస్తున్నాయని ఆరోపణలు
- గోదాం నుంచి వచ్చే బియ్యంలోనే సమస్య ఉందన్న పాఠశాల ఇన్‌చార్జి
- భోజన నాణ్యత మెరుగుపర్చాలని విద్యా కమిటీ సమావేశంలో డిమాండ్

**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కృష్ణాజివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహించిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నంలో ప్రతిరోజూ పురుగులు, ఇసుక వస్తున్నాయని, ఈ విషయాన్ని తమ పిల్లలు ఇంటికి వెళ్లి చెబుతున్నారని తెలిపారు. నాసి రకం ఆహారం కారణంగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినలేక ఇబ్బందులు పడుతున్నారని, వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. దీనిపై స్పందించిన పాఠశాల ఇన్‌చార్జి గోదాం నుంచి సరఫరా అవుతున్న బియ్యంలోనే పురుగులు ఉన్నాయని, ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు లోకజ్ఞానం కూడా అవసరమని, తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని తల్లిదండ్రులు కోరగా, పాఠశాలలో డైనింగ్ హాల్ సౌకర్యం లేకపోవడం, ఉపాధ్యాయుల వయస్సు తదితర కారణాల వల్ల అది సాధ్యపడడం లేదని వారు వివరించారు. అయితే భోజన నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రతి వారం ఒక తల్లిదండ్రి పాఠశాలకు వచ్చి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూసి తన అభిప్రాయాన్ని నమోదు చేయాలని సమావేశంలో సూచించారు. సమావేశంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, ఉపాధ్యాయులు శ్వేత, శ్రీహరి, రాజిరెడ్డి, హేమంత్‌కుమార్, రాజుతో పాటు తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేయూ ఉద్యమకారుల గుర్తింపునకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలి

- తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థులకు అధికారిక గుర్తింపు కల్పించాలి
- నామినేటెడ్ పదవులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరిన కేయూ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ




**ప్రజానావ, కాకతీయ యూనివర్సిటీ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కాకతీయ యూనివర్సిటీ (కేయూ) విద్యార్థి ఉద్యమకారులను అధికారికంగా గుర్తించి, వారి సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (కేయూజేఏసీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తక్షణమే కాకతీయ యూనివర్సిటీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి ఉద్యమకారుల వివరాలను సేకరించి వారికి అధికారిక గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేసింది. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కేయూ విద్యార్థి ఉద్యమకారుల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థలు, బోర్డులు, కమిటీల్లో కేయూ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు తమ చదువులు, ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిగత భవిష్యత్తును సైతం పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ గత 12 సంవత్సరాలుగా వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకులకే అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కేయూ ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో కాకతీయ యూనివర్సిటీని సందర్శించిన ప్రస్తుత ముఖ్యమంత్రి విద్యార్థి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్య బీమా తదితర సంక్షేమ పథకాలను ఉద్యమకారులకు అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కేయూ విద్యార్థి ఉద్యమకారుల సంక్షేమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఝార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల తరహాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో విద్యార్థి ఉద్యమకారులకు 10 శాతం సమాంతర రిజర్వేషన్ కల్పించాలని, కాకతీయ యూనివర్సిటీ ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఉద్యమకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి అధికారిక గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో డా. సాదు రాజేష్, డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, డా. ఫిరోజ్‌పాషా, డా. చిర్రా రాజు, డా. మంద వీరాస్వామి, డా. దేవోజీ నాయక్, శ్రీరామ్ శ్యామ్, డా. బండి శ్రీనివాస్, డా. గజ్జల మల్లేష్, డా. ఎస్. అనిల్, డా. ప్రేమ్, డా. కొమురయ్య, డా. ఆరూరి రంజిత్, డా. క్రాంతి, కన్నం సునీల్, నాగారాజు పటేల్, డా. జట్టి రాజేందర్, కే. చిరంజీవి, ప్రసాద్‌తో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

# సర్‌ను పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలి

- ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా అధికారులు పనిచేయాలి
- రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి సమీక్ష



**ప్రజానావ, వరంగల్:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–2026) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, తెలంగాణ రాష్ట్ర స్కిల్, హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్ (శక్తి) శాఖ కార్యదర్శి హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఇంటింటి సర్వే, ఫారాల పంపిణీ, స్వీకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడం, అనర్హుల వివరాల పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణను పూర్తిస్థాయి పారదర్శకంగా నిర్వహించి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, కాలపట్టికను కచ్చితంగా పాటిస్తూ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణపై ప్రజల్లో మరింత విస్తృత అవగాహన కల్పించాలని, దరఖాస్తులు ఎందుకు సమర్పించాలి, ఎక్కడ, ఎప్పుడు, ఎలా సమర్పించాలి, అవసరమైన పత్రాలు ఏమిటి, తరచుగా అడిగే ప్రశ్నలకు సమాధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. శాశ్వతంగా నివాసం మారిన వారు, వలస వెళ్లిన వారు, ఓటరు వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు స్వచ్ఛందంగా తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ పనితీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, మీడియాతో సమన్వయం కొనసాగిస్తూ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సరైన సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు ప్రతిరోజూ పోలింగ్ కేంద్రాల వారీగా పురోగతిని విశ్లేషిస్తూ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా ప్రతి దశలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తిచేసి, 68.13 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో మొత్తం 5.09 లక్షల మంది ఓటర్లు, 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. గైర్హాజరు ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని, ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్‌ఏలను నియమించి గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు అధికారులతో పాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను నియమించామని, 2కే రన్‌లు, మీడియా సమావేశాలు, ప్రచార వాహనాలు, బీఎల్‌ఏ లకు శిక్షణ, ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. హెల్ప్‌డెస్కులు, మీడియా మానిటరింగ్ సెంటర్, కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులను 48 గంటల్లో పరిష్కరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద జిల్లాలో ఇప్పటివరకు 71 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికాగా 74 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లాలో 71.74 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత కాలపట్టిక లో పూర్తి చేస్తామని చెప్పారు. ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికాగా 75.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, ఎన్నికల విభాగ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకించాలి

- వర్షపు నీటితోనే భూగర్భ జలాల పరిరక్షణ సాధ్యం
- మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత: జిల్లా కలెక్టర్ కే. హరిత

**ప్రజానావ, ఆసిఫాబాద్:** ప్రతి వర్షపు నీటి బొట్టును వృథా కాకుం డా భూమి లోకి ఇంకించి భూగర్భ జలాలను పరిర క్షించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రజలకు పిలుపుని చ్చారు. వన మహోత్సవం కార్యక్ర మంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ రాజస్వ మండల అధి కారి కార్యాలయ ఆవర ణలో మొక్క లు నాటిన అనంతరం ఆమె మాట్లా డుతూ, దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎల్‌నినో ప్రభావంతో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడం వల్ల భూగర్భ జలాల మట్టాలు క్రమంగా తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భావితరాలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టాలని సూచించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి వనరుల సంరక్షణ కూడా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. వర్షపు నీటిని వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవడంతో పాటు నీటి వినియోగంలో పొదుపు పాటించే అలవాటును ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మండల తహసీల్దార్ రియాజ్ అలీ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- తాగునీటికి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల :** రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల పై నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లాలోని ఎగువ మానేరు రిజర్వా యర్ పూర్తి స్థాయి నీటి మట్టం రెండు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.612 టీఎంసీల నీరు ఉందని వెల్లడించారు. అలాగే మల్కపేట రిజర్వాయర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం మూడు టీ ఎం సీ లు కాగా, ప్రస్తుతం 1.33 టీఎంసీల నీరు ఉందని, అన్నపూర్ణ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 3.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.45 టీఎంసీల నీరు ఉందని, మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.44 టీఎంసీల నీరు ఉందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటి వరకు లోటు వర్షపాతం నమోదు అయిందని వెల్లడించారు. ఎగువ నుంచి రిజర్వాయర్లకు వరద రావడం లేదని, ప్రస్తుతం రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి కోసం ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు ఎక్కువగా లేవని తెలిపారు. దీంతో ఆయా రిజర్వాయర్లు, చెరువులు, కుంటల కింద సాగునీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వివరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. స్వల్ప కాలిక పంటలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు, ఆయిల్ పామ్ తదితర పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫాం పాండ్స్, బోర్ వెల్స్ రీచార్జ్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫాం పాండ్స్ తో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, ఎన్నో లాభాలు ఉన్నాయని తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ ల పరిధిలో బోర్ వెల్స్ రీచార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బోర్ వెల్స్ రీచార్జ్ తో భూ గర్భ జలాలు పెరిగి నీటి ఇబ్బందులు దూరమవుతాయనే విషయాన్ని తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా నీటి పారుదల దయాకర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెకండ్‌హ్యాండ్ మొబైల్ కొనుగోలు సమయంలో

# ఆధార్, ఇతర వివరాలు నమోదు చేయాలి

- దొంగిలించిన మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠిన చర్యలు
- మొబైల్ దొంగల సమాచారమిస్తే ప్రశంసా పత్రంతో సత్కారం
- ఎస్పీ మహేష్ బీ.గితే
- మొబైల్ షాప్స్ రిపేర్ షాప్స్ యజమానుల సమావేశం




**ప్రజానావ, సిరిసిల్ల :** మొబైల్ షాప్ యజమానులు సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు లేదా ఎక్స్ఛేంజ్ చేసే సమయంలో విక్రయించే వ్యక్తి యొక్క ఆధార్ కార్డు తో పాటుగా పూర్తి వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మొబైల్ షాప్స్ యజమాను లకి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పరిధిలోని పలు మొబైల్ షాప్స్ అలాగే రిపేర్ షాప్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సందర్భాల్లో దొంగలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ అమ్మడానికి లేదా ఎక్స్ఛేంజ్ చేయడానికి వచ్చిన వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తు వారి యొక్క ఆధార్ కార్డ్‌తో పాటుగా పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా లేదా దొంగిలించిన మొబైల్ ఫోన్ల విక్రయానికి ప్రయత్నిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగలను పట్టించడంలో లేదా వారి ఆచూకీ పోలీసులకు అందించడంలో సహకరించిన మొబైల్ షాప్ యజమానులకు జిల్లా పోలీసుల తరపున ప్రశంసాపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే సమయంలో సంబంధిత మొబైల్ షాప్ యజమాని నుంచి తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకోవాలని, తక్కువ ధరకు లభిస్తుందనే ఆశతో దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దొంగిలించబడిన మొబైల్ ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ విక్రయించాలనుకునే వారు సంబంధిత కంపెనీల స్టోర్ లలో ఎక్స్ఛేంజ్ లేదా చట్టబద్ధమైన విక్రయ కేంద్రాల ద్వారానే విక్రయించాలని, తెలియని వ్యక్తులకు లేదా అనధికారికంగా కొనుగోలు చేసే షాపులకు విక్రయించవద్దని సూచించారు. ఇటువంటి దొంగిలించబడిన మొబైల్ ఫోన్లు సైబర్ నేరాలకు వినియోగించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. అందరి సహకారంతోనే మొబైల్ ఫోన్స్ రికవరిలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానం, రాష్ట్రంలో వరుసగా మూడవ సంవత్సరం మొదట స్థానంలో నిలవడం జరిగిందని, అందరి సహకారంతోనే నేరాల నియంత్రించవచ్చని తెలిపారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో బ్లాక్ చేసి, సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజాతిరు మలేష్, మొబైల్ షాప్స్ యజమానులు పాల్గొన్నారు.

# నాగలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎన్నారై ప్రసాదరావు

**ప్రజానావ, పెద్దపల్లి :** అమెరికాకు చెందిన ఎన్నారై హర్కర ప్రసాదరావు పెద్దపల్లి మండలంలోని రాగినేడు శ్రీ స్వయంభూ నాగలింగేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను పూర్తిచేసిన అనంతరం స్వామికి రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వపు చైర్మన్ కోలేటి దామోదర్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్మించబడి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి శ్రీ నాగలింగేశ్వర స్వామి సన్నిధానం ప్రశాంతమైన వాతావరణంతో శోభాయనమరంగా ఉందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తొలిసారిగా ఈ దేవాలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, గ్రామ సర్పంచ్ సోమా కుమార్ ఉప సర్పంచ్ గుమ్మడి విజయ దేవాలయ నిర్మాణ కర్త కోలేటి దామోదర్, మాజీ జడ్పీటీసీ రఘువీర్ సింగ్, కోలేటి శ్రీనివాసులు ఎన్నారై ప్రసాద్ రావుకు తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువతో సత్కరించి దేవాలయ చిత్రపటాన్ని బహుకరించారు

# రేషన్ కార్డుదారులు 31 లోగా ఈ–కేవైసీ పూర్తి చేయాలి

**జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి**



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా లోని రేషన్ కార్డు దారులందరూ ఈ–కేవైసీ పూర్తి చేయని వారు జులై 31 లోగా ఈ–కేవైసీ పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రకటించారు. ఈ మేరకు అన్ని రేషన్ దుకాణములో ఈ–కేవైసీ సేవలు అందుబాటులో ఉన్నాయని, సాధారణ లబ్ధిదారులతో పాటు పోర్టబిలిటి ద్వారా రేషన్ పొందుతున్న వారు కూడా తప్పనిసరిగా ఈ–కేవైసీ పూర్తి చేయాలని, త్వరలో పురోగతి పై సమీక్ష ఉండనున్న నేపథ్యములో లబ్ది దారులు ఆలస్యం చేయకుండా సమీప రేషన్ దుకాణమును సంప్రదించి ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సరఫరాల అధికారి కోరారు.

# దళిత్ శక్తి ప్రోగ్రామ్ రాష్ట్ర కన్వీనర్‌గా అగ్గిమల్ల గణేష్

- డీఎస్‌పీ రాష్ట్ర స్థాయి సమావేశంలో నియామకాన్ని ప్రకటించిన వ్యవస్థాపకులు డా. విశారదన్ మహరాజ్
- దళితులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని పిలుపు



**ప్రజానావ, ఆదిలాబాద్:** దళిత్ శక్తి ప్రోగ్రామ్ (డీఎస్‌పీ) రాష్ట్ర కన్వీనర్‌గా అగ్గిమల్ల గణేష్‌ను నియమించినట్లు డీఎస్‌పీ రాష్ట్ర వ్యవస్థాపకులు, అధినేత డా. విశారదన్ మహరాజ్ ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన డీఎస్‌పీ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇప్పటివరకు డీఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అగ్గిమల్ల గణేష్‌కు రాష్ట్ర కన్వీనర్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్రంలో దళితులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం మరింత చురుకుగా పనిచేయాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించే సామాజిక శక్తిగా ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించేందుకు కృషి చేయాలని డా. విశారదన్ మహరాజ్ సూచించారు. అగ్గిమల్ల గణేష్ గత కొంతకాలంగా బీసీ, ఎస్సీ, ఎస్టీతో పాటు అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తూ సామాజిక సేవలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన అగ్గిమల్ల గణేష్‌కు పలు దళిత, బహుజన, ఆదివాసీ సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో డీఎస్‌పీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# వాంగ్‌చుక్‌ను ఆస్పత్రికి తరలించిన పోలీసులు

- దీక్ష కొనసాగింపునకు దీప్కే ముందుకు
- హైకోర్టు ఆదేశాలతో సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చేర్పింపు
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు



**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనవ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు శనివారం బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన తీవ్ర బలహీనత, డీహైడ్రేషన్‌కు గురికావడంతో వైద్య చికిత్స అందించాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. నిరసనకారుల స్వల్ప ప్రతిఘటన మధ్య పోలీసులు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

### వైద్య చికిత్సపై భార్య అభ్యంతరం

వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఆయనకు నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరమని తెలిపారు. అయితే తన అనుమతి లేకుండా ఎలాంటి చికిత్స అందించవద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంపై, వైద్య పరీక్షల వివరాల కాపీ ఇవ్వకపోవడంపై కూడా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

### ఉద్యమం ఆగదు.. నిరవధిక దీక్షకు దీప్కే సిద్ధం

మరోవైపు, వాంగ్‌చుక్‌ను ఆస్పత్రికి తరలించినంత మాత్రాన ఉద్యమం ఆగిపోదని క్రాకోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. వాంగ్‌చుక్ స్థానంలో తాను నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మద్దతుదారులు పెద్ద సంఖ్యలో జంతర్‌మంతర్‌కు చేరాలని పిలుపునిచ్చారు. జులై 20న నిర్వహించనున్న చలో సంసద్ మార్చ్‌ను యథావిధిగా కొనసాగిస్తామని దీప్కే స్పష్టం చేశారు. అదే రోజు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వద్ద పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు.

# రైలులో వేధించిన యువకుడికి యువతి వినూత్న గుణపాఠం



**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని భూసావల్ – వర్ధా ప్యాసింజర్ మెమో రైలులో తనను వేధించిన ఓ యువకుడికి యువతి వినూత్నంగా గుణపాఠం చెప్పింది. తోటి ప్రయాణికుల సహకారంతో యువకుడి చేతులకు గాజులు తొడిగి, పెదవులకు లిప్‌స్టిక్ పూసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రజలు స్పందిస్తున్నారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది ప్రయోగం పూర్తి
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు




**శ్రీహరికోట :** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే ''విక్రమ్–1'' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, 'విక్రమ్–1' రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతే కాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. 'విక్రమ్–1' ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డ్యీబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను డా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన 'విక్రమ్–1' పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్–ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు 'విక్రమ్–1'తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారు డు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి ''విక్రమ్–1'' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోదీ హర్షం

- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
- ఇంజినీర్ల కృషిని ప్రశంసిస్తూ.. తనను కలవాలని సందేశం



**న్యూఢిల్లీ :** భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం ''విక్రమ్–1'' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయప డ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని వూరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. ''విక్రమ్–1''లో తన 'వందేమా తరం' సందేశంతో డిన కార్డును డా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం డా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమ న్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష ంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన ''విక్రమ్–1'' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం

- పలు జిల్లాలకు రెడ్ అలర్ట్
- కేదార్‌నాథ్ మార్గంలో విరిగిపడిన కొండచరియలు
- గుర్రాలు, డోలీ సేవలను నిలిపేసిన అధికారులు
- గర్బాధార్ వద్ద రహదారి మూసివేత
- ధార్చులా బేస్‌క్యాంప్‌లోనే కైలాస్–మానస సరోవర్ యాత్రికులు



**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రెండు ప్రధాన పుణ్యయాత్రలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. కేదార్‌నాథ్ యాత్ర మార్గంలో చోటుచేసుకున్న కొండచరియల కారణంగా గుర్రాలు, కంచర గాడిదలు, డోలీ సేవలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. మరోవైపు గర్బాధార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో కైలాస్–మానస సరోవర్ యాత్ర నాలుగో విడత బృందం ముందుకు సాగలేక ధార్చులా బేస్‌క్యాంప్‌లోనే నిలిచిపోయింది. రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఆదివారం నైనిటాల్, చంపావత్, ఉదమ్‌సింగ్‌నగర్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. డెహ్రాడూన్, తెహ్రీ, పౌరీ, హరిద్వార్, బాగేశ్వర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఉత్తర్‌కాశీ, రుద్రప్రయాగ్, చమోలి, అల్మోరా, పిథోరాగఢ్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. వర్షాల ప్రభావం మరో కొన్ని రోజుల పాటు కొనసాగనున్నట్లు ఐఎండీ తెలిపింది. జులై 20న డెహ్రాడూన్, హరిద్వార్, తెహ్రీ జిల్లాలకు మరోసారి రెడ్ అలర్ట్ జారీ చేయగా, నైనిటాల్, ఉత్తర్‌కాశీ, పౌరీ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. జులై 21, 22 తేదీల్లోనూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గౌరికుండ్–కేదార్‌నాథ్ కాలినడక మార్గంలో శుక్రవారం కొండచరియలు విరిగిపడి భారీ బండరాళ్లు, మట్టి రోడ్డుపై చేరడంతో యాత్రకు అంతరాయం ఏర్పడింది. సహాయక బృందాలు వెంటనే శిథిలాలను తొలగించి కాలినడక మార్గాన్ని పునరుద్ధరించాయి. అయితే యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గుర్రాలు, కంచర గాడిదలు, డోలీ సేవలను నిలిపివేసినట్లు రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి నందన్‌సింగ్ రాజ్వార్ తెలిపారు. పిథోరాగఢ్ జిల్లాలోని గర్బాధార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో గుంజీ మార్గం పూర్తిగా మూసుకుపోయింది. దీంతో 50 మంది యాత్రికులతో కూడిన కైలాస్–మానస సరోవర్ యాత్ర నాలుగో విడత బృందాన్ని ధార్చులా బేస్‌క్యాంప్‌లోనే నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.

### అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్‌కుమార్ సుమన్ ఆదేశించారు. కొండచరియలు విరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, జిల్లా అత్యవసర నియంత్రణ కేంద్రాలు 24 గంటలూ పనిచేసేలా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చార్‌ధామ్ యాత్రికులు, కైలాస్–మానస సరోవర్ యాత్రికులు, పర్యాటకులు అవసరం లేకుంటే ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రయాణానికి ముందు వాతావరణ పరిస్థితులు, రహదారుల స్థితిగతులను తెలుసుకోవాలని, భారీ వర్షాల సమయంలో నదులు, వాగులు, వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# ప్రధాన్ రాజీనామా అవసరం లేదు

- నీట్ పేపర్ లీక్ నిందితులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం
- కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే

**శ్రీనగర్:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిపై ఇప్పటికే ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు. శ్రీనగర్‌లో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడిన అథవాలే, నీట్ పేపర్ లీక్ ఘటన జరగడం బాధాకరమే. అయితే ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పడం సరికాదు. ఇప్పటికే నిందితులపై కఠిన చర్యలు చేపట్టాం అని తెలిపారు. పేపర్ లీక్ కేసులో పలువురు నిందితులను అరెస్టు చేశామని, వారిలో గణనీయమైన సంఖ్యలో మహారాష్ట్రకు చెందినవారే ఉన్నారని చెప్పారు. లడఖ్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను విరమించాలని అథవాలే కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రశ్నాపత్రాల లీకేజీలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. పేపర్ లీక్‌లను నివారించేందుకు సూచనలు చేసే హక్కు వాంగ్‌చుక్‌కు ఉందని, అయితే ఆ కారణంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అథవాలే స్పష్టం చేశారు




# మిర్చి రైతులకు కేంద్రం అండ

- జీఐ ట్యాగ్ సాంబా మిర్చి ఉత్పత్తులకు ప్రోత్సాహం
- తమిళనాడులో రైతు ఉత్పత్తిదారుల సంస్థను ప్రారంభించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

**చెన్నై:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తమిళనాడులోని విరుధునగర్ జిల్లాలో గ్లోబల్ చిల్లీ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ)ను ప్రారంభించారు. తిరుచ్చులి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, జీఐ ట్యాగ్ పొందిన సాంబా మిర్చి, వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఈ సంస్థ దోహదపడుతుందని తెలిపారు. ఈ రైతు ఉత్పత్తిదారుల సంస్థను భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్‌బీ) ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా అవసరమైన అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తూ సిడ్‌బీ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆమె ప్రశంసించారు. ఈ ప్రాంతంలో పండించే సాంబా మిర్చిలో పురుగుమందుల వినియోగం చాలా తక్కువగా ఉండటంతో విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఒక జిల్లా–ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్) పథకం కింద ఈ జిల్లాలో మిర్చి సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌కు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

### తొలి ఎగుమతి వాహనాలకు జెండా

ఈ రైతు ఉత్పత్తిదారుల సంస్థ తయారు చేసిన సాంబా మిర్చి, విలువ ఆధారిత ఉత్పత్తులను శ్రీలంకతో పాటు ఆంధ్రప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాలు, ఈ–కామర్స్ సంస్థలకు తరలించే తొలి ఎగుమతి వాహనాలకు నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు విరుధునగర్ జిల్లా తిరుచ్చులిలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ క్రీడా స్టేడియాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో నిర్మించిన ఈ స్టేడియంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్ వంటి క్రీడలకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

# అమెరికాకు భారీ నష్టం

- మరో ఇద్దరు సైనికుల మృతి, 16కు చేరిన మరణాలు
- జోర్డాన్‌లో తాజా దాడిలో ఒక సైనికుడు గల్లంతు
- ఇరాన్‌లోనూ 50 మంది మృతి, 500 మందికిపైగా గాయాలు

**బ్రిడ్జ్‌వాటర్:** ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధంలో అమెరికా సైనికులకు ఎదురవుతున్న ప్రాణనష్టం రోజురోజుకూ పెరుగుతోంది. ఆధునిక డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలతో పోరు సాగుతున్నప్పటికీ సైనికుల మరణాలను పూర్తిగా నివారించడం సాధ్యం కావడం లేదు. తాజాగా జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై జరిగిన దాడిలో ఇద్దరు సైనికులు మరణించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) ప్రకటించింది. మరో సైనికుడు గల్లంతయ్యాడని, నలుగురు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని వెల్లడించింది. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన కొద్ది రోజులకే కువైట్‌లోని ఓ పౌర నౌకాశ్రయంపై జరిగిన ఇరాన్ డ్రోన్ దాడిలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించారు. అనంతరం మార్చి 1న సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో గాయపడిన మరో సైనికుడు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. అదే నెలలో ఇరాక్‌లో అమెరికా సైనిక కార్యకలాపాలకు మద్దతుగా వెళ్తున్న కే.సీ–135 ఇంధన సరఫరా విమానం కూలిపోవడంతో మరో ఆరుగురు సైనికులు మరణించారు. ఈ నెల ప్రారంభంలో అరేబియా సముద్రంలో అమెరికా నౌకాదళానికి చెందిన హెలికాప్టర్ కూలిపోవడంతో ఒక పైలట్ మరణించాడు. అయితే ఆ ప్రమాదం శత్రు దాడి వల్ల సంభవించలేదని అమెరికా నౌకాదళం అప్పట్లో స్పష్టం చేసింది.

### జోర్డాన్‌లో తాజా దాడి

శనివారం జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిని తిప్పికొట్టే ప్రయత్నంలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించగా, మరో సైనికుడు అదృశ్యమయ్యాడు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించిన అనంతరం వారి పేర్లను వెల్లడిస్తామని అమెరికా సైన్యం తెలిపింది. అమెరికా వైమానిక దాడుల్లో గత మూడు వారాల్లో ఇరాన్‌లో కనీసం 50 మంది మరణించగా, 500 మందికిపైగా గాయపడినట్లు ఇరాన్ అధికారులు ప్రకటించారు. ఇటీవల వంతెనపై జరిగిన దాడిలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు.

# గుండిచా ఆలయంలోకి జగన్నాథుడు

### ఏడు రోజుల పాటు ఆలయంలోనే కొలువుదీరనున్న దివ్యమూర్తులు

**భువనేశ్వర్:** ఒడిశాలోని పుణ్యక్షేత్రం పూరీలో జరుగుతున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో మరో కీలక ఘట్టం శనివారం సాయంత్రం ఆధ్యాత్మిక వైభవంతో జరిగింది. శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను రథాల నుంచి గుండిచా ఆలయ గర్భగుడిలోకి తీసుకెళ్లే 'ఆడప మండప బిజే' కార్యక్రమాన్ని లక్షలాది మంది భక్తులు భక్తిపారవశ్యంతో వీక్షించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రధాన జగన్నాథ ఆలయం నుంచి గుండిచా ఆలయానికి చేరుకున్న మూడు రథాలపై రాత్రంతా దివ్యమూర్తులు సంప్రదాయం ప్రకారం కొలువుదీరారు. శనివారం రాత్రి పుష్పాంజలి తదితర సంప్రదాయ పూజలు పూర్తయిన అనంతరం సుమారు రాత్రి 8.30 గంటలకు 'పహాండి' పేరుతో జరిగే ఊరేగింపు ప్రారంభమైంది. ముందుగా బలభద్రుడిని, అనంతరం సుభద్రాదేవిని, చివరిగా జగన్నాథ స్వామిని ఆలయంలోకి తీసుకెళ్లే కార్యక్రమం నిర్వహించారు. పురాణాల ప్రకారం గుండిచా ఆలయమే జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి చెక్క విగ్రహాలు విశ్వకర్మ చేత రూపొందించబడిన ప్రదేశంగా భావిస్తారు. ఇంద్రద్యుమ్న మహారాజు సతీమణి గుండిచా పేరుమీద ఈ ఆలయానికి నామకరణం జరిగింది. దివ్యమూర్తులు ఏడు రోజుల పాటు గుండిచా ఆలయంలోనే కొలువుదీరుతారు. అనంతరం జులై 24న జరిగే 'బహుడా యాత్ర' సందర్భంగా సుమారు 2.6 కిలోమీటర్ల దూరంలోని ప్రధాన జగన్నాథ ఆలయానికి తిరిగి చేరుకుంటారు.



### పోటెత్తిన భక్తజనం

రథయాత్ర తొలి విడత ముగింపుగా భావించే ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీకి తరలివచ్చారు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ గుండిచా ఆలయం ఎదుట ఉన్న శరధాబలి ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒడిశా పోలీసులు ఏకమార్గ దర్శన విధానాన్ని అమలు చేస్తున్నారు. గత ఏడాది గుండిచా ఆలయం సమీపంలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మృతి చెందిన నేపథ్యంలో ఈసారి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఒడిశా డీజీపీ వై.బీ. ఖురానియా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో యాత్రకు తీసుకురావద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉంటే పూరీలో గత 24 గంటల్లో 86.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పట్టణంలో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు అధిక సామర్థ్యం గల మోటార్లను అధికారులు వినియోగిస్తున్నారు. రథయాత్ర భద్రత బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అదనపు డీజీపీ సౌమేంద్ర ప్రియదర్శి మాట్లాడుతూ, శుక్రవారం రాత్రి నుంచే పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. భువనేశ్వర్ నుంచి పూరీకి వచ్చే భక్తులు తమ ప్రయాణాన్ని సక్రమంగా ప్రణాళిక చేసుకునేందుకు ట్రాఫిక్ పరిస్థితులపై మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని చెప్పారు. భారత వాతావరణ శాఖ పూరీలో శనివారం మోస్తరు వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో భారీ జల్లులు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

# రైలు ఢీకొని ఆరు జింకల మృతి

- పట్టాలు దాటుతుండగా విషాదం
- నాగ్‌పూర్ జిల్లాలో ఘటన

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున రైలు ఢీకొని ఆరు జింకలు మృతి చెందాయి. ముంబై–హౌరా ప్రధాన రైల్వే మార్గంలోని కన్హాన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అధికారుల వివరాల ప్రకారం.. నాగ్‌పూర్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని తుకారాం నగర్ ప్రాంతంలో ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య జింకల మంద రైల్వే పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు వాటిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదు ఆడ జింకలు, ఒక మగ జింక అక్కడికక్కడే మృతి చెందినట్లు కన్హాన్ పోలీసు స్టేషన్ అధికారులు తెలిపారు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు పంచనామా నిర్వహించి మృతదేహాలను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టారు.

## సాకా హ్యాట్రిక్‌తో ఇంగ్లండ్‌కు మూడో స్థానం

- ప్రపంచకప్‌లో ఫ్రాన్స్‌పై 6-4 తేడాతో థ్రిల్లింగ్ విజయం
- ఎంబాప్పే రెండు గోల్స్.. మెస్సీ ప్రపంచకప్ గోల్స్ రికార్డును అధిగమింపు
- మూడో స్థానం పోరులో ఏకంగా 10 గోల్స్.. ప్రపంచకప్ చరిత్రలో అరుదైన మ్యాచ్

**మయామి గార్డెన్స్:** ప్రపంచకప్ ఫుట్‌బాల్‌లో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్ అభిమానులకు గోల్స్ వర్షం కురిపించింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్ జట్ల మధ్య జరిగిన ఈ హోరాహోరీ పోరులో మొత్తం 10 గోల్స్ నమోదవగా, ఇంగ్లండ్ 6-4తో ఘన విజయం సాధించి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఇంగ్లండ్ స్టార్ బుకాయో సాకా 37వ నిమిషంలో తొలి గోల్ సాధించాడు. అనంతరం తొలి అర్ధభాగం అదనపు సమయంలో మరో గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ చివర్లో 87వ నిమిషంలో పెనాల్టీని గోల్‌గా మలిచి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఇంగ్లండ్ తరఫున అతనికి ఇది రెండో అంతర్జాతీయ హ్యాట్రిక్. డెక్లాన్ రైస్, ఎజ్రీ కొన్సా కూడా చెరో గోల్ చేయడంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇంగ్లండ్ 4-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగం అదనపు సమయంలో జూడ్ బెల్లింగ్‌హామ్ మరో గోల్ చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు.

### ఎంబాప్పేకు కొత్త రికార్డు

ఫ్రాన్స్ స్టార్ కైలియన్ ఎంబాప్పే రెండో అర్ధభాగంలో రెండు గోల్స్ సాధించి ప్రపంచకప్‌లలో తన కెరీర్ గోల్స్ సంఖ్యను 22కు పెంచుకున్నాడు. దీంతో 21 గోల్స్‌తో ఉన్న లియోనెల్ మెస్సీ రికార్డును అధిగమించాడు. ఈ ప్రపంచకప్‌లో ఎంబాప్పే మొత్తం 10 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రాన్స్ తరఫున బ్రాడ్లీ బార్కోలా, ఉస్మాన్ డెంబెలే కూడా చెరో గోల్ సాధించినప్పటికీ జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయారు. ఇదిలాఉంటే 1982 ప్రపంచకప్‌లో హంగేరీ 10-1తో ఎల్‌సాల్వడార్‌పై గెలిచిన తర్వాత ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ నమోదైన మ్యాచ్‌గా ఇది నిలిచింది. అలాగే మూడో స్థానం కోసం జరిగిన ప్రపంచకప్ మ్యాచ్‌ల చరిత్రలో అత్యధికంగా 10 గోల్స్ నమోదైన తొలి పోరుగా కూడా రికార్డు సృష్టించింది. 1966లో ప్రపంచకప్ టైటిల్ గెలిచిన తర్వాత ఇంగ్లండ్‌కు ప్రపంచకప్‌లో ఇదే అత్యుత్తమ ముగింపు కావడం విశేషం.









# మెస్సీనా... స్పెయినా?

- నేడు ప్రపంచకప్ ఫైనల్లో ఫుట్‌బాల్ మహాసమరం
- వరుసగా రెండో టైటిల్‌పై అర్జెంటీనా గురి
- రెండో ప్రపంచకప్ కోసం స్పెయిన్ పోరు

**ఈస్ట్ రూథర్‌ఫోర్డ్:** ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. ఆదివారం జరిగే తుది పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, అజేయ జోరులో ఉన్న స్పెయిన్‌తో తలపడనుంది. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీకి ఇదే చివరి ప్రపంచకప్‌గా భావిస్తున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌పై మరింత ఆసక్తి నెలకొంది. ఒకవైపు మెస్సీకి విజయవంతమైన వీడ్కోలు ఇవ్వాలనే సంకల్పంతో అర్జెంటీనా బరిలోకి దిగుతుండగా, మరోవైపు వరుసగా 37 మ్యాచ్‌లుగా ఓటమి ఎరుగని స్పెయిన్ రెండో ప్రపంచకప్ కిరీటాన్ని కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. 2022 ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న అర్జెంటీనా, ఈసారి కూడా విజేతగా నిలిస్తే వరుసగా రెండు ప్రపంచకప్‌లు గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టిస్తుంది. చివరిసారిగా బ్రెజిల్ 1958, 1962 ప్రపంచకప్‌లను వరుసగా గెలుచుకుంది. ఇదే తన చివరి ప్రపంచకప్ అని మెస్సీ ఇప్పటికే స్పష్టం చేయడంతో ఈ ఫైనల్ ఆయన కెరీర్‌లో అత్యంత కీలక మ్యాచ్‌గా మారింది. అర్జెంటీనా ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోనీ మాట్లాడుతూ.. మెస్సీ ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాడు. అతని నాయకత్వం మా జట్టుకు అపారమైన బలం అని ప్రశంసించాడు.

### కిరీటం ఎవరిది?

అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా నిర్వహిస్తున్న 48 జట్ల ఈ మెగా ప్రపంచకప్‌లో మొత్తం 104 మ్యాచ్‌లు జరిగాయి. ఆదివారం జరిగే ఫైనల్‌తో టోర్నీకి తెరపడనుంది. మెస్సీ కెరీర్‌కు అద్భుత ముగింపు లభిస్తుందా? లేక స్పెయిన్ తన అజేయ ప్రస్థానాన్ని ప్రపంచకప్ కిరీటంతో మరింత గొప్పగా నిలబెట్టుకుంటుందా? అన్న ఉత్కంఠతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఈ మహాసమరాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### మెస్సీ- స్పెయిన్‌కు ప్రత్యేక అనుబంధం

అర్జెంటీనాలో జన్మించిన మెస్సీ చిన్న వయసులోనే స్పెయిన్‌కు వెళ్లి అక్కడే తన ఫుట్‌బాల్ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. స్పెయిన్ తరఫున ఆడాలని పలుమా ర్లు అవకాశం వచ్చినా, తన మాతృదేశం అర్జెంటీనాకే ప్రాతినిధ్యం వహించాడు. 2010 తర్వాత తొలిసారిగా స్పెయిన్‌తో అంతర్జాతీయ మ్యాచ్‌లో తలపడనున్నాడు. స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమాల్‌తో మెస్సీకి ఉన్న అనుబంధం కూడా ఈ ఫైనల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నతనంలో యమాల్‌ను మెస్సీ ఎత్తుకున్న ఫొటో ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైతే, ఇప్పుడు అదే ఇద్దరూ ప్రపంచకప్ ఫైనల్‌లో ప్రత్యర్థులుగా బరిలోకి దిగడం విశేషం. ఇదిలాఉంటే 2016 కోపా అమెరికా ఫైనల్లో చిలీ చేతిలో ఓటమి అనంతరం మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు ప్రకటించాడు. అయితే కొద్ది వారాల్లోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని జట్టులోకి తిరిగి వచ్చాడు. అనంతరం 2021, 2024 కోపా అమెరికా టైటిళ్లు, 2022 ప్రపంచకప్‌ను అర్జెంటీనాకు అందించి తన గొప్పతనాన్ని మరోసారి నిరూపించాడు.

### అజేయంగా దూసుకొచ్చిన స్పెయిన్

2024 ప్రారంభం నుంచి స్పెయిన్ వరుసగా 37 మ్యాచ్‌ల్లో అపజయం చవిచూడకుండా ఫైనల్‌కు చేరుకుంది. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు కేవలం ఒకే ఒక్క గోల్‌ను మాత్రమే ప్రత్యర్థులకు ఇచ్చిన ఆ జట్టు రక్షణశ్రేణి అద్భుత ప్రదర్శన కనబర్చింది. టోర్నీ మొత్తం ఒక్క క్షణం కూడా వెనుకబడకుండా ఫైనల్‌కు చేరుకోవడం స్పెయిన్ ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తోంది. స్పెయిన్ కెప్టెన్ రోడ్రీ మాట్లాడుతూ.. అర్జెంటీనా అంటే కేవలం మెస్సీ మాత్రమే కాదు. ప్రతి విభాగంలో బలమైన జట్టు. అయినప్పటికీ మెస్సీని నియంత్రించడం మా ప్రధాన లక్ష్యాల్లో ఒకటి అని పేర్కొన్నాడు.




## రెండేళ్ల తర్వాత!

- చరిత్ర సృష్టించిన సింధు
- తొలిసారి జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు చేరిన భారత మహిళా షట్లర్
- సెమీస్‌లో చెన్ యుఫీయ్‌పై 21-19, 15-10 తేడాతో విజయం

తెలుగు తేజం పీవీ సింధు చరిత్ర సృష్టించింది. తొలిసారి జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు చేరిన భారత మహిళా షట్లర్‌గా రికార్డు నమోదు చేసింది. సెమీస్‌లో సింధు 21-19, 15-10 తేడాతో చైనాకు చెందిన చెన్ యుఫీయ్‌పై విజయం సాధించింది. రెండో సెట్‌లో సింధు ఆధిక్యంలో ఉండగానే.. యుఫీయ్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. దీంతో సింధు ఫైనల్‌లో అడుగు పెట్టింది. రెండేళ్ల తర్వాత ఓ ఫైనల్‌కు చేరడం సింధుకు ఇదే తొలిసారి. చివరిసారి 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ విజేతగా సింధు నిలిచింది.

### యమగుచితో తుది పోరు

జపాన్ ఓపెన్ ఫైనల్‌లో అకనె యమగుచితో పీవీ సింధు తలపడనుంది. సెమీస్‌లో 9-21, 21-16, 21-14 తేడాతో పుత్రి కుసుమ వర్ధానిపై జపాన్‌కు చెందిన యమగుచి విజయం సాధించి ఫైనల్‌కు వచ్చింది. ఆదివారం టైటిల్ పోరు జరగనుంది. ఇందులోనూ గెలిస్తే జపాన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న తొలి భారత మహిళా షట్లర్‌గా సింధు అవతరించనుంది.

## కామన్వెల్త్‌కు రెడీ

**126 మంది భారత జట్టును ప్రకటించిన ఐఓ**

ఏఎడిన్‌బర్గ్: స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జూలై 23 నుంచి ప్రారంభమయ్యే కామన్వెల్త్ క్రీడలకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) 126 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఒలింపిక్ పతక విజేతలు మీరాబాయి చాను, లొవ్లీనా బొర్గొహైన్ భారత బృందానికి నాయకత్వం వహించనున్నారు. ప్రారంభోత్సవ వేడుకల్లో వీరిద్దరూ భారత ప్రతినిధులుగా ముందుండనుండగా, ఒకరు జాతీయ పతాకాన్ని, మరొకరు క్రీడా జ్యోతిని మోస్తారు. టోక్యో ఒలింపిక్స్ రజత విజేత మీరాబాయి మహిళల 48 కేజీల వెయిట్‌లిఫ్టింగ్‌లో, కాంస్య విజేత లొవ్లీనా మహిళల 75 కేజీల బాక్సింగ్‌లో పోటీ పడనున్నారు.



## దిగొచ్చిన బంగారం.. పెరిగిన వెండి

- హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.2వేల తగ్గుదల
- కిలో వెండి ధర రూ.2.25 లక్షలకు చేరిక

ప్రజానావ, హైదరాబాద్: అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా బంగారం ధరలు స్వల్పంగా తగ్గగా, వెండి ధరలు మాత్రం పెరిగాయి. హైదరాబాద్‌లో శనివారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2 వేల మేర తగ్గి రూ.1,43,400కు చేరింది. అదే విధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,350గా నమోదైంది. మరోవైపు వెండి ధరలు భారీగా పెరిగాయి. కిలో వెండి ధర ఒక్కరోజులో రూ.3 వేలకు పైగా పెరిగి రూ.2,25,000కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,019.05 డాలర్ల వద్ద, వెండి ధర 55.99 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, డాలర్ బలోపేతం, అమెరికా బాండ్ రాబడుల వృద్ధి వంటి పరిణామాలు విలువైన లోహాల ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాల నేపథ్యంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఎక్కువకాలం అధిక స్థాయిలో కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నా యి. ఈ పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.




## మూడు బ్యాంకులకు మెరుగైన ఫలితాలు

- పీఎన్‌బీ నికర లాభం మూడింతలు
- యాక్సిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లకూ రెండంకెల వృద్ధి
- తొలి త్రైమాసిక పలితాల్లో గణనీయమైన వృద్ధి నమోదు

**ముంబై:** ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక (ఏప్రిల్-జూన్) ఫలితాలను ప్రకటించాయి. మూడు బ్యాంకులూ లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేయగా, ముఖ్యంగా పీఎన్‌బీ నికర లాభం మూడింతలు పెరగడం విశేషం. పీఎన్‌బీ జూన్ త్రైమాసికంలో రూ.5,253 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.1,675 కోట్లతో పోలిస్తే ఇది మూడు రెట్లకు పైగా అధికం. మొత్తం ఆదాయం రూ.37,231 కోట్లకు చేరగా, నికర వడ్డీ ఆదాయం రూ.32,897 కోట్లుగా నమోదైంది. యాక్సిస్ బ్యాంక్ ఏకీకృత ప్రాతిపదికన రూ.7,632.31 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 22.23 శాతం అధికం. స్టాండలోన్ ప్రాతిపదికన లాభం రూ.7,114 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం పెరిగి రూ.14,646 కోట్లుగా నమోదైంది. కార్పొరేట్ రుణాలు 38 శాతం, రిటైల్ రుణాలు 8 శాతం పెరిగినట్లు బ్యాంక్ వెల్లడించింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏకీకృత నికర లాభం 22.55 శాతం పెరిగి రూ.5,480.46 కోట్లకు చేరింది. స్టాండలోన్ ప్రాతిపదికన లాభం రూ.4,122.96 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.7,928 కోట్లకు చేరగా, మొత్తం డిపాజిట్లు 14 శాతం వృద్ధితో రూ.5.59 లక్షల కోట్లకు పెరిగాయి. బ్యాంకు ఆర్థిక సూచీలు కూడా స్థిరమైన వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది.

## యాపిల్ మ్యూజిక్, వన్ సబ్‌స్క్రిప్షన్లు ఇక ఖరీదు

- భారత్‌తో పాటు పలు దేశాల్లో ధరల పెంపు
- వ్యక్తిగత, ఫ్యామిలీ, స్టూడెంట్ ప్లాన్లకు కొత్త ధరలు అమలు
- మ్యూజిక్ లైసెన్సింగ్ వ్యయాల పెరుగుదలే కారణం: యాపిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాపిల్ మరోసారి తన సేవల ధరలను పెంచింది. ఇటీవల మ్యాక్‌బుక్, ఐప్యాడ్ ధరలను పెంచిన సంస్థ, తాజాగా యాపిల్ మ్యూజిక్, యాపిల్ వన్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ల ధరలను కూడా సవరించింది. దీంతో వ్యక్తిగత, ఫ్యామిలీ, స్టూడెంట్ ప్లాన్‌లను వినియోగిస్తున్న కస్టమర్లపై అదనపు భారం పడనుంది. మ్యూజిక్ లైసెన్సింగ్ వ్యయాలు పెరగడమే ధరల సవరణకు కారణమని యాపిల్ తెలిపింది. భారత్‌తో పాటు అమెరికా, యూరప్ తదితర ప్రధాన మార్కెట్లలో కూడా కొత్త ధరలను అమల్లోకి తీసుకొచ్చింది. సవరించిన ధరల ప్రకారం, వ్యక్తిగత యాపిల్ మ్యూజిక్ ప్లాన్ నెలవారీ చార్జీ రూ.119 నుంచి రూ.139కు పెరిగింది. ఫ్యామిలీ ప్లాన్ రూ.179 నుంచి రూ.229కు, స్టూడెంట్ ప్లాన్ రూ.59 నుంచి రూ.69కు పెంచింది. కొత్త ధరలను యాపిల్ తన అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అప్‌డేట్ చేసింది. అదే విధంగా యాపిల్ మ్యూజిక్, యాపిల్ టీవీ+, ఇతర డిజిటల్ సేవలను కలిపి అందించే యాపిల్ వన్ ప్లాన్‌ల ధరలను కూడా సవరించింది. వ్యక్తిగత ప్లాన్‌ను రూ.175 నుంచి రూ.195కు, ఫ్యామిలీ ప్లాన్‌ను రూ.235 నుంచి రూ.295కు, ప్రీమియం ప్లాన్‌ను రూ.899 నుంచి రూ.995కు పెంచింది. ఈ ధరల పెంపుతో యాపిల్ సేవలను వినియోగించే సభ్యుల నెలవారీ వ్యయం మరింత పెరగనుంది.



## Business బిజినెస్

## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్?

- వ్యాపారులపై మర్చంట్ డిస్కౌంట్ రేటు విధింపుపై కేంద్రం పరిశీలన
- 0.5 శాతంలోపే ఛార్జీలు ఉండొచ్చని సమాచారం
- అదనపు భారంతో యూపీఐ వినియోగంపై ప్రభావం: నిపుణుల ఆందోళన




**న్యూఢిల్లీ:** దేశంలో డిజిటల్ చెల్లింపులకు వెన్నెముకగా మారిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) విధించే అవకాశంపై చర్చ కొనసాగుతోంది. యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే వ్యాపారులపై ఎండీఆర్ అమలు చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం వెలుగులోకి రావడంతో ఈ అంశం ప్రాధాన్యత సంతరిం చుకుంది. ఎండీఆర్ ఛార్జీలు 0.5 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ ప్రతిపాదనపై పరిశ్రమ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు, దాని ప్రభావం వినియోగదారులపైనా పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### లాభదాయకతపై ప్రభావం

ఎండీఆర్ అమలైతే వ్యాపారుల నిర్వహణ వ్యయాలు పెరిగి, లాభదాయకతపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా, వినియోగదారులకు అందించే క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లు, ఇతర ప్రమోషనల్ ఆఫర్లు కూడా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. అవసరమైతే అదనపు భారాన్ని ధరల రూపంలో వినియోగదారులపై మోపే పరిస్థితులు కూడా తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలంలో ఎండీఆర్ ఛార్జీల ప్రభావంతో యూపీఐ వినియోగం మందగించే అవకాశం ఉందని, డిజిటల్ చెల్లింపుల విస్తరణపై కూడా ప్రతికూల ప్రభావం పడొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదు.

## అనిల్ అంబానీ గ్రూప్‌పై సీబీఐ సోదాలు

**దిల్లీ, ముంబయిలోని 15 ప్రాంతాల్లో తనిఖీలు.. 23 సంస్థలు సోదాల పరిధిలోకి**



**న్యూఢిల్లీ:** రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్‌ఎల్), రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్)కు సంబంధించిన రుణాల అక్రమాల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దర్యాప్తును మరింత ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఏడీఏ గ్రూపుతో సంబంధం ఉన్న సంస్థలపై శనివారం దిల్లీ, ముంబయిలోని మొత్తం 15 ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీలు ముంబయి ప్రత్యేక కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందిన అనంతరమే చేపట్టినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. రిలయన్స్ ఏడీఏ గ్రూపుతో అనుబంధం ఉన్న 23 సంస్థలు ఈ సోదాల పరిధిలోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు, భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ ఇప్పటికే ఆర్‌సీఎఫ్‌ఎల్, ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌లపై ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. బ్యాంకుల నుంచి పొందిన భారీ రుణాలను అనిల్ అంబానీ గ్రూపుతో అనుబంధం ఉన్న 23 సంస్థల ద్వారా నిధుల మళ్లింపునకు ఉపయోగించారని, తద్వారా రుణ దాతలకు ఉద్దేశపూర్వకంగా ఆర్థిక నష్టం కలిగించారనే ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది.



# సమంతకు సర్‌ప్రైజ్ సీమంతం!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు డా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒ రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నా రు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపో తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రేక్షక మదిని మెప్పించని 'వదలా'

జగపతిబాబు, లయ, హ్రితిక శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో ఆకెళ్ల వి. కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ 'వదలా' ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కిషోర్ నాయుడు చిరు మామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించిన ఈ చిత్రానికి కార్తిక్ బి. కొడకండ్ల సంగీతం అందించగా, చోటా కే. నాయుడు ఛాయాగ్రహణం, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. కథ విషయానికి వస్తే.. మధ్యప్రదేశ్‌లో వైద్యుడిగా పనిచేసే యోగి సిద్ధార్థ్ (జగపతిబాబు) తన భార్య ప్రియ (లయ), పిల్లలతో ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని గడుపుతుంటాడు. ఒక ప్రమాదం నేపథ్యంలో అముద (హ్రితిక శ్రీనివాస్) అనే యువతి అతని జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఆమె రాకతో కుటుంబంలో అనూహ్య పరిణామాలు చోటుచేసు కుంటాయి. అసలు అముద ఎవరు? ఆమె ఉద్దేశం ఏమిటి? నివాస్ (శ్రీనివాస్ అవసరాల)తో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే సినిమా కథ. సినిమాకు ప్రధాన బలం హ్రితిక శ్రీనివాస్ నటనే అని చెప్పాలి. మానసిక సమస్యలతో బాధపడే యువతి పాత్రలో ఆమె సహజమైన అభినయంతో ఆకట్టుకుంది. గ్లామర్‌తో పాటు భావోద్వేగాలను సమర్థంగా పలికించి తన పాత్రకు న్యాయం చేసింది. జగపతిబాబు కూడా కుటుంబాన్ని ప్రేమించే వైద్యుడి పాత్రలో తన అనుభవాన్ని మరోసారి చాటుకున్నారు. లయ పాత్ర ప్రారంభంలో సాధారణంగా కనిపించినప్పటికీ క్లైమాక్స్‌లో భావోద్వేగభరిత నటనతో మెప్పించారు. రవి వర్మతో పాటు శ్రీనివాస్ అవసరాల తదితరులు తమ పాత్రల పరిధిలో సంతృప్తికరంగా నటించారు. అయితే కథనం విషయంలో సినిమా తీవ్రంగా నిరాశపరుస్తుంది. దర్శకుడు ఎంచుకున్న ప్రధాన అంశం ఆసక్తికరంగా ఉన్నప్పటికీ దాన్ని తెరపై మలిచిన విధానం ఆకట్టుకోదు. ప్రారంభంలో



కథపై ఆసక్తి కలిగించినా, తర్వాత కథనం నెమ్మదిగా సాగుతూ ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తుంది. జగపతిబాబు – హ్రితిక మధ్య వచ్చే కొన్ని సన్నివేశాలు, ప్రేమ – ఆకర్షణ అంశాలను చూపించిన తీరు సహజంగా అనిపించదు. ఫస్ట్ హాఫ్‌లో జగపతిబాబు, లయ మధ్య రొమాంటిక్ ట్రాక్ కూడా కొంత అతిగా అనిపిస్తుంది. కథ చివర్లో ఇచ్చిన ట్విస్టులు భావోద్వేగానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయాయి. హ్రితిక పాత్ర కుటుంబాన్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టిన తర్వాత కూడా ఆమెను సులభంగా క్షమించి ఇంట్లో ఫొటో పెట్టుకునే ముగింపు సహజత్వానికి దూరంగా అనిపిస్తుంది. సాంకేతికంగా సినిమా నిర్మాణ విలువలు బాగున్నాయి. కార్తిక్ బి. కొడకండ్ల అందించిన సంగీతం వినసొంపుగా ఉంది. చోటా కే. నాయుడు సినిమాటోగ్రఫీ చిత్రానికి మంచి విజువల్ క్వాలిటీ తీసుకొచ్చింది. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ పర్వాలేదనిపిస్తుంది. అయితే దర్శకుడు ఆకెళ్ల వి. కృష్ణ మంచి భావోద్వేగ ప్రధానమైన అంశాన్ని ఎంచుకున్నప్పటికీ, దానిని ప్రభావవంతంగా తెరకెక్కించడంలో విఫలమయ్యారు. మొత్తంగా చూస్తే 'వదలా' మంచి నటీనటుల ప్రదర్శన ఉన్నప్పటికీ, బలహీనమైన కథనం కారణంగా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేని సైకలాజికల్ థ్రిల్లర్‌గా నిలుస్తుంది. హ్రితిక శ్రీనివాస్, జగపతిబాబు, లయల నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచినా, నెమ్మదిగా సాగే కథనం, ప్రభావం చూపలేని ట్విస్టులు, భావోద్వేగాల లోపం కారణంగా సినిమా ప్రేక్షకులపై ఆశించిన ముద్ర వేయలేకపోయింది.

# అంచనాలు పెంచిన చెన్నై లవ్ స్టోరీ

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తున్న ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చెన్నై లవ్ స్టోరీ ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉండగా, తాజాగా వచ్చిన ట్రైలర్‌తో ఆ ఆసక్తి మరింత పెరిగింది. ప్యూర్, ఇంటెన్స్ ఎమోషనల్ లవ్ స్టోరీగా రూపొందించిన ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈసారి కిరణ్ అబ్బవరం బాక్సాఫీస్ వద్ద మరో రొమాంటిక్ హిట్ అందుకునేలా కనిపిస్తున్నాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రైలర్‌లో చెన్నై నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథను చూపించారు. భిన్నమైన మనస్తత్వాలు కలిగిన ఇద్దరు యువతీ యువకుల మధ్య ఏర్పడే పరిచయం, అది ప్రేమగా మారడం, అనంతరం వారి జీవితాల్లో చోటుచేసుకునే అనూహ్య పరిణామాలు, భావోద్వేగాలతో కథను సహజంగా నడిపించినట్లు తెలుస్తోంది. ప్రేమ, కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కిరణ్ అబ్బవరం తన కొత్త లుక్, సహజమైన నటన, డైలాగ్ డెలివరీతో ఆకట్టుకోగా, శ్రీ గౌరీ ప్రియతో ఆయన కెమిస్ట్రీ ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇద్దరి మధ్య సాగే రొమాంటిక్, ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను కథతో మమేకం చేసేలా ఉన్నాయి. ముఖ్యంగా ట్రైలర్ చివర్లో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. సాయి రాజేష్, ఎస్.కె.ఎన్ నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన జిగితార పాటకు లభించిన స్పందనకు కొనసాగింపుగా ట్రైలర్‌లోని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విజువల్స్, మ్యూజిక్, ఎమోషన్స్ సమతూకంగా ఉండటంతో సినిమా ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంత మేర ఆకట్టుకుంటుందో, కిరణ్ అబ్బవరంకు మరో విజయాన్ని అందిస్తుందో చూడాలి.



# ప్రెగ్నెన్సీతోనే రాకా షూట్‌లో దీపికా పడుకొణె

బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె వృత్తిపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వస్తున్న 'రాకా'లో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా కోసం ప్రెగ్నెన్సీతోనే ఆమె కఠినమైన యాక్షన్ సన్నివేశాలు షూట్ చేశారని సమాచారం. గతంలో 'ఎనిమిది గంటల పని' నిబంధన తెరపైకి తీసుకొచ్చిన దీపికా.. 'రాకా' కోసం మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా పని చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆమె రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెలిసిందే. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందే, 'రాకా'లో తన షూటింగ్‌ను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అటు షూటింగ్‌లో పాల్గొంటూనే తన మొదటి తురు దువాను డా చూసుకుంటున్నారు. దీపిక లైఫ్‌ని ఇలా బ్యాలెన్స్ చేస్తుండడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది. అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్‌తో దీపికా పదుకొణె తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటుండటంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# డిఫరెంట్ కాన్సెప్ట్ కథ.. ఓ.. సుకుమారి



ఈ వారం ప్రేక్షకులకు వినోదం పంచడానికి వచ్చిన చిత్రం 'ఓ..! సుకుమారి'. కథాబలమున్న సినిమాలతో ప్రయాణం చేసే తిరువీర్ కథానాయకుడు కాగా.. ప్రముఖ కథానాయిక ఐశ్వర్య రాజేశ్ ఆయనతో జోడీ కట్టడం, ప్రచార చిత్రాలూ, సినిమాలోని కాన్సెప్ట్ ప్రేక్షకుల్ని ప్రముఖంగా ఆకర్షించిన అంశాలు. యాదగిరి అలియాస్ యాది (తిరువీర్) పెళ్లికి సిద్ధమవుతాడు. పక్క ఊరిలోని ఓ అమ్మాయిని చూడటానికి వెళ్లి దామిని (ఐశ్వర్య రాజేశ్)పై మనసు పడతాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆ ఊళ్లో డా ఎలాగైనా దామినికి పెళ్లి చేసి సాగనంపాలనేది గ్రామస్తుల ప్లాన్. దానికి కారణం ఆమెకొక విచిత్రమైన సమస్య ఉండటమే. ఆమెను ముట్టుకోగానే షాక్ కొడుతుంది. ఆ సమస్య వల్ల ఊళ్లో వాళ్లు చాలా రకాలుగా ఇబ్బందులు పడుతుంటారు. అందు యాది ఇష్టపడటమే ఆలస్యం... ఆ ఊరంతా కలిసి దామిని పెళ్లిని ఘనంగా చేసి సాగనంపుతుంది. అసలు చిక్కులు ఆ తర్వాతే మొదలవుతాయి. ముట్టుకుంటేనే షాక్ కొట్టే దామినితో యాదగిరి కాపురం ఎలా చేశాడు? అత్తారింట్లో దామిని ఎలా కలిసిపోయింది? ఆమెకున్న షాక్ సమస్యని తన భర్త ఊరి జనాలు ఎప్పుడు ఎలా తెలుసుకున్నారు? యాది పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం వెనకున్న బలమైన ఆ కారణాలేమిటి? తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే. తిరువీర్ ఇటీవల నటించిన 'పాపం ప్రతాప్'లో కథానాయకుడి పాత్రకు సమస్య ఉంటుంది. అది డా భార్యాభర్తల మధ్య కాపురానికి సవాల్‌గా నిలిచిన సమస్యే. ఇందులోనేమో కథానాయికకి సమస్య. ఈ రెండూ డా గ్రామీణ నేపథ్యంతో సాగే కథలే. మరికొన్ని సారూప్యతలూ కనిపిస్తాయి. ముట్టుకోగానే షాక్ కొట్టే ఓ అమ్మాయి... అది తెలియక ఆమెని పెళ్లి చేసుకున్న ఓ అబ్బాయి... ఆ ఇద్దరి మధ్య కలిసి కాపురం ఎలా సాగించారన్నది ఆసక్తిని రేకెత్తించే విషయమే. నాయకానాయికలు, నిర్మాతలు వినగానే సినిమా చేయడానికి ఒప్పుకొనేలా ప్రేరేపించే కథాంశమే ఇది. కథానాయికకి ఉన్న సమస్య ప్రపంచంలోనే ఒకరిద్దరికి మాత్రమే ఉన్న అరుదైనదని చెప్పారు. అలాంటప్పుడు ఆ సమస్యతో అంతగా కనెక్ట్ కాలేము. పోనీ, అరుదైన సమస్య కదాని సీరియస్‌గా ఏమైనా దాని గురించి చర్చించారా? అంటే అదీ లేదు. షాక్ సమస్య ఎందుకు వచ్చిందో చెప్పారు కానీ, చివరిలో ఎందుకు రాదో చెప్పలేదు.

# కియారాపై ట్రోల్స్!



గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'టాక్సిక్ లోని 'తబాహి' వీడియో పాటపై ట్రోల్స్ వచ్చాయి. యశ్, కియారా మధ్య ఉన్న రొమాంటిక్ సన్నివేశాలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. యశ్‌ను ప్రశంసిస్తూ.. కియారాను విమర్శించడంపై 'టాక్సిక్'లో నటిస్తోన్న బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యశ్ అద్భుతంగా కనిపించాడంటూ కామెంట్ సెక్షన్‌లో ఎమోజీలతో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ కియారా విషయానికి వస్తే, ఆమెను దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. 'పెళ్లి అయ్యాక డా ఇలాంటి సన్నివేశాల్లో నటించడం అవసరమా' అని మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?. యశ్‌కు డా పెళ్లయింది.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వలం నటీమణులపైనే ఎందుకు ఇంత దారుణంగా ట్రోలింగ్ జరుగుతోంది? వాస్తవాన్ని గ్రహించండి. వారు నటీనటులు. స్క్రీన్‌పై పాత్రలను పండించడం, కథకు తగ్గట్టుగా నటించడమే వారి పని' అని అన్నారు.

# సీత పాత్ర నా అదృష్టం



నమిత్ మల్హోత్రా నిర్మాణంలో, నితేశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో తెరకెక్కు తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం రామాయ ణ. ఢిల్లీలో జరిగిన ప్రథమ్ సంకల్ప్ కార్యక్రమంలో పాల్గొన్న సాయి పల్లవి, సీతాదేవి పాత్ర తనకు దక్కడం జీవితంలో ఒక గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. సీతాదేవి వంటి పవిత్రమైన పాత్రను పోషించే అవకాశం ప్రతి నటికి రాదని, ఆ పాత్రకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో తాను ప్రతిరోజూ ధ్యానం చేస్తూ, తన ఆలోచనలను పవిత్రంగా ఉంచుకునేదాన్నని చెప్పారు. ఈ ప్రయాణంలో ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నానని, భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా రామాయణ చిత్రాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు చిత్ర బృందం ఎంతో అంకితభావంతో కృషి చేస్తోందని సాయి పల్లవి తెలిపారు.

# 3 ఇడియట్స్‌తో సోనమ్‌కు సంబంధం లేదు

స్టార్ హీరో ఆమిర్ ఖాన్ తాజాగా '3 ఇడియట్స్' సినిమాపై ఎన్నాళ్లుగానో ప్రచారంలో ఉన్న అపోహకు తెరదించారు. ఆ సినిమాలో ఆయన పోషించిన 'రాంచో' పాత్రను లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఆమిర్ ఖాన్, తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'లగాన్' చిత్రం 25 ఏళ్ల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రేక్షకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా '3 ఇడియట్స్' సినిమాలోని రాంచో పాత్ర, సోనమ్ వాంగ్‌చుక్ మధ్య ఉన్న సంబంధంపై ప్రశ్నలు ఎదురవగా, ఆమిర్ పూర్తి వివరణ ఇచ్చారు. రాంచో పాత్రను సోనమ్ వాంగ్‌చుక్‌ను దృష్టిలో పెట్టుకుని రాశారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆమిర్ స్పష్టం చేశారు. '3 ఇడియట్స్' సినిమా రూపొందించే సమయంలో మాకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి అసలు తెలియదు. ఆ పాత్రకు ఆయన జీవితానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇటీవల సినిమాలో 'చతుర్ రామలింగం' పాత్ర పోషించిన నటుడు ఓమి వైద్య చేసిన వ్యాఖ్యలను డా ఆమిర్ ప్రస్తావించారు. ఓమి చెప్పిన వీడియో నేను డా చూశాను. కానీ అది సరైన సమాచారం కాదు. బహుశా అతను అలా భావించి ఉండొచ్చు. కథ రచయితలు రాజ్‌కుమార్ హిరాణీ, అభిజాత్ జోషి, తనకు ఎవరికీ ఆ సమయంలో సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదు అని స్పష్టం చేశారు. సినిమా పాత్రకు సంబంధం లేకపోయినా, సమాజం కోసం సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని ఆమిర్ కొనియాడారు.

# రిస్కే నా సక్సెస్



కమర్షియల్ విజయాల కోసం మాత్రమే సినిమాలు చేయడం తన లక్ష్యం కాదని, నమ్మిన కథ కోసం రిస్క్ తీసుకోవడమే తన కెరీర్‌లో అతిపెద్ద విజయమని బాలీవుడ్ నటి తాప్సి పన్ను పేర్కొంది. అందుకే నాయికా ప్రాధాన్యమైన, ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూ వస్తున్నానని తెలిపింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సి, "నా కెరీర్‌లో కమర్షియల్‌గా విజయం సాధించవని చాలామంది భావించిన ప్రాజెక్ట్‌లను కూడా ధైర్యంగా అంగీకరించాను. అదే నాకు నేను ఇచ్చుకునే అతిపెద్ద క్రెడిట్. ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్లు సాధిస్తుందనే మూస ధోరణిలో ఇరుక్కుపోవాలని నేను ఎప్పుడూ అనుకోను" అని చెప్పింది. "ఏ సినిమా చేసినా ముందుగా దాని ఉద్దేశాన్ని నేను అర్థం చేసుకుంటాను. అదే భావాన్ని ప్రేక్షకులు కూడా ఆస్వాదిస్తారనే నమ్మకంతో రిస్క్ తీసుకుని ముందుకు వెళ్తాను. అప్పుడు ఆ సినిమా ఫలితం ఏదైనా దానిని పూర్తిగా నా విజయంగానో, వైఫల్యంగానో స్వీకరిస్తాను" అని పేర్కొంది. సినీ పరిశ్రమలో నటీనటులు మరింత ధైర్యంగా కొత్త కథలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని తాప్సి అభిప్రాయపడింది. "అర్థవంతమైన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో నిర్మాతలు, రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకులు అందరూ కీలక పాత్ర పోషిస్తారు. అయితే అలాంటి విభిన్న కథలను నమ్మి ముందుకు తీసుకెళ్లడంలో నటీనటుల పాత్ర అత్యంత ముఖ్యమైనది" అని ఆమె చెప్పింది. తాప్సి ప్రస్తుతం 'గాంధారి' చిత్రంలో నటిస్తుండగా, ఈ సినిమా ద్వారా త్వరలోనే ప్రేక్షకులను పలకరించనుంది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277